

భారత దేశ రాజకీయాలలో సూపర్ స్టార్ , తెలుగు జాతి గర్వించదగ్గ ఆణిముత్యం చంద్రబాబు. భారత దేశంలో ఆయనకు ఉన్న క్రేజు ఏ నాయకులకు లేదు. చంద్రబాబు ఒక వ్యక్తి కాదు సామూహిక శక్తి. ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సమపాళ్లలో అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 18.05.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 26 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# అంపశయ్యపై నుంచి అభివృద్ధి పథంలోకి...

- కూటమి రాకతో చేనేతకు స్వర్ణయుగం ప్రారంభం
- చేనేత రంగ అభివృద్ధికి నూతన టెక్స్ టైల్స్ పాలసీ
- నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగేలా పథకాలు అమలు
- లక్షకు పైగా నేతన్నల కుటుంబాల్లో ఉచిత విద్యుత్ వెలుగులు
- 15 శాతం సబ్సిడీకే నూలు... 90 శాతం సబ్సిడీతో ఆధునిక పనిముట్లు
- చేనేత సహకార సంఘాలకు విడతల వారీగా బకాయిల చెల్లింపు
- రాష్ట్ర వ్యాప్తంగా క్లస్టర్లు, మెగా టెక్స్ టైల్స్ పార్కుల ఏర్పాటు
- చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ఒప్పందాలు
- ఆప్కో షో రూముల్లో పెరిగిన అమ్మకాలు... ఇళ్ల ముంగిటకే చేనేత వస్త్రాలు
- లోకేష్ చొరవతో మంగళగిరి చేనేతకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : కూటమి ప్రభుత్వం రాక నిస్తేజంలో కూరుకుపోయిన నేతన్నకు భరోసానిచ్చింది. గత రెండేళ్ల కాలంలో చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అంపశయ్యపై ఉన్న చేనేత పరిశ్రమ అభివృద్ధి పథంలోకి పయనించసాగింది. ఒకవైపు నూతన టెక్స్ టైల్స్ పాలసీ, మరోవైపు వ్యక్తిగత లబ్ధి పొందేలా పథకాల అమలు, ఇంకోవైపు చేనేత సహకార సంఘాల బలోపేతానికి చర్యలతో డీలా పడిన చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం జవసత్వాలు నింపింది. నేను కూలీని కాదు కళాకారుడిని అని నేతన్నలు కాలెరగేసేలా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది, ఆత్మగౌరవాన్ని ఇచ్చింది. చేనేత రంగాన్ని ఆదుకున్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు సైతం నేతన్నలకు లబ్ధి కలిగేలా ఎన్నో నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇక మంత్రి నారా లోకేష్ తీసుకున్న చొరవతో మంగళగిరి చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు, గౌరవం దక్కింది.

**చేనేతకు పథకాలతో చేయూత...** : 2024లో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం చేనేతలకు అండగా నిలిచింది. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 92,724 మంది నేతన్నలకు రూ.3 వేల నుంచి రూ. 4 వేలకు పెన్షన్ పెంచారు. చేనేతలకు త్రిఫ్ట్ కింద ప్రభుత్వ వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచారు. ఈ పథకం కింద 2024-25లో రూ.5 కోట్లు, 2025-26లోనూ మరో రూ.5 కోట్లు కేటాయించారు. త్రిఫ్ట్ పథకం ద్వారా 5,726 మందికి లబ్ధి కలిగింది. రెండేళ్లలో రూ.65.35 కోట్ల మేర ముద్ర రుణాలను 6,808 మందికి అందజేశారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం (ఎన్.హెచ్.డి.పి)పథకం ద్వారా చిన్న క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.10.44 కోట్లను వెచ్చించగా, 7,500 మంది చేనేతలకు లబ్ధి కలిగింది. రూ.175 కోట్లతో ముడి పదార్థాల సరఫరా పథకం ద్వారా నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా చేనేత ఉత్పత్తుల 5 శాతం జీఎస్టీ రియింబర్స్ మెంట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ.10 వేలు విలువ చేసే నూలును అందజేస్తున్నారు. 2024 ఏప్రిల్ నుంచి 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ.78.73 కోట్ల నగదు పరపతి సౌకర్యం కల్పించారు. ఆధునిక పనిముట్ల కొనుగోలుకు 90 శాతం వరకు సబ్సిడీతో పాటు క్యాష్ క్రెడిట్ పథకం కింద సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నారు.

**నేతన్నల కుటుంబాల్లో 'ఉచిత' వెలుగులు** : గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు స్వయంగా నేతన్నల కష్టాలను తెలుసుకుని, ఉచిత విద్యుత్ అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మరమగ్గం నేతన్నలకు 500 యూనిట్ల విద్యుత్ ను ఉచితంగా అందిస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.150 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం వెచ్చిస్తోంది. సుమారు 1.04 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి కలుగనుంది. పథకం ద్వారా ఏడాదికి మగ్గం నేతన్నలకు రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు రూ.21,600లు ఆదా అవుతోంది.

**ఇళ్ల ముంగిటకే చేనేత వస్త్రాలు** : నేటితరం అభిరుచులకు అనుగుణంగా చేనేత వస్త్రాల తయారీలో 5 జిల్లాల్లో నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. కలంకారి చీరలు, పెన్ కలంకారి చీరలు, దుపట్టాలు, డిజిటల్ ప్రింటెడ్ చీరలు, క్రోచెట్ లేస్ చీరల తయారీలో శిక్షణ అందజేశారు. ఆప్కో షో రూముల్లో రెడీమేడ్ చేనేత వస్త్రాలను అమ్మకాలు ప్రారంభించారు. వెల్కో ధోవతులు, కాటన్ రెడీమేడ్ పెళ్లికూతురి ధోవతులు, మోడీ జాకెట్లు, సిల్క్ పెళ్లికూతురి సెట్లు, కొత్త డిజైన్లతో రెడీమేడ్ షర్టులు, లెనిన్ షర్టుల సహా వందకు పైగా డిజైన్లతో చేనేత రెడీమేడ్ వస్త్రాలను అమ్మకాలు చేస్తున్నారు. మారిన అభిరుచుల నేపథ్యంలో యువత, మహిళలు చేనేత వస్త్రాల కొనుగోలుకు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నారు. ఆన్ లైన్ లోనూ చేనేత రెడీమేడ్ దుస్తులు,ఇతర వస్త్రాలను విక్రయిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 40 ఆప్కో షో రూమ్స్ ద్వారా 6,770 ఉత్పత్తులను అమ్మకాలకు పెట్టారు. ఈ కామర్స్ అమ్మకాలతో నేరుగా వినియోగదారుల ఇళ్లకే వస్త్రాలను డోర్ డెలివరీ చేస్తున్నారు. ఆప్కో పేరిట సొంత వెబ్ సైటును అందుబాటులోకి తీసుకొచ్చారు. చేనేత వస్త్రాల పై సోషల్ మీడియాలోనూ విస్తృత ప్రచారం చేస్తూ, నేటి తరానికి నేతన్నలను కూటమి ప్రభుత్వం మరింత దగ్గర చేస్తోంది.

**మెగా క్లస్టర్లు, టెక్స్ టైల్స్ పార్కుల ఏర్పాటు** : చేనేతలకు 365 రోజులూ పని కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నూతన టెక్స్ టైల్స్ పాలసీని అమలు చేసి, ఈ పాలసీ ద్వారా చేనేత రంగంలో రూ. 10,000 కోట్ల పెట్టుబడుల సేకరించాలని, 1.51 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా మిగతా 2లో...



## నారా దేవాన్ష్ యూట్యూబ్ చానల్ 'డైనో డీట్స్' ప్రారంభం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తనయుడు నారా దేవాన్ష్ యూట్యూబ్ చానల్ 'డైనో డీట్స్' ప్రారంభించారు. అందుకు సంబంధించిన టీజర్‌ను ఆదివారం విడుదల చేశారు. అందులో దేవాన్ష్ తండ్రి నారా లోకేశ్ భాగమయ్యారు. డైనో డీట్స్ టీజర్‌లోని యూట్యూబ్, పాడ్ కాస్ట్ ప్రత్యేకతలను దేవాన్ష్ ద్వారా మంత్రి నారా లోకేశ్ తెలుసుకున్నారు. దేవాన్ష్ సృష్టించిన ప్రాచీన ప్రపంచంలోకి నేను ఒక ప్రేక్షకుడిలా ప్రవేశించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నానంటూ మంత్రి లోకేశ్ ఉద్విగ్నంగా తన భావాలను సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా నారా లోకేశ్ స్పందించారు. ఈ సందర్భంగా నారా దేవాన్ష్‌కు నారా - నందమూరి కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.
డైనోసార్లు, శిలాజాలు, పురాతన అవశేషాల గురించి తాను తెలుసుకున్న ఆశ్చర్యపరిచే నిజాలు, డైనోసార్ల వింతలు, విశేషాలు ఆకట్టుకునే శైలిలో, మిగతా 2లో...

## పర్యాటకంతో రాష్ట్ర ప్రగతి... పురోగతి

- పర్యాటకాభివృద్ధితో 1.22 లక్షల మందికి ఉద్యోగ-ఉపాధి అవకాశాలు
- టూరిజానికి పారిశ్రామిక హోదాతో ఏపీకి తరలి వస్తున్న ప్రాజెక్టులు
- రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేలా పర్యాటకాభివృద్ధికి రోడ్ మ్యాప్
- హోటళ్లు, హోం స్టేలు, థీమ్ పార్కులు, కారవాన్ టూరిజంలతో పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు
- బీచ్ ఫెస్టివల్స్, కార్నివాల్స్ తో కళకళలాడుతోన్న రాష్ట్రం
- జగ్గన్నతోట ప్రభల ఉత్సవంతో వెల్లివిరిసిన సాంస్కృతిక శోభ
- అన్ని ఇజంల కంటే టూరిజం బెస్ట్ అనే థియరితో టూరిజం అభివృద్ధికి ముఖ్యమంత్రి మార్గనిర్దేశం

• వివరాలు 2 లో



## జనసేన బలోపేతంపై ఫోకస్

- జనసేన ముఖ్యనేతలతో పవన్ కల్యాణ్ సమావేశం
- కమిటీల ఏర్పాటుపై కీలక ఆదేశాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : జనసేన అధినేత పవన్ కల్యాణ్ అమరావతిలో మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, నియోజకవర్గాల వారిగా పార్టీ బలోపేతం లాంటి అంశాలపై చర్చించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని పనవ్ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి కమిటీలో మొత్తం ఏడుగురు సభ్యులు ఉండేలా రూపకల్పన చేశారు. ఈ కమిటీల్లో సంబంధిత పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మిగతా 2లో...

## కేరళ కొత్త మంత్రివర్గం ఖరారు!

ప్రమాణ స్వీకారానికి ముందే ప్రకటించిన సతీశన్

**కేరళ (జర్నలిస్ట్ ఫైల్)** : కేరళలో సోమవారం వీడీ సతీశన్ సారథ్యంలో యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్-యూడీఎఫ్ ప్రభుత్వం కొలువుదీరేందుకు రంగంసిద్ధమైంది. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో వీడీ సతీశన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. కాంగ్రెస్ నుంచి 12 మంది, ఐయూఎంఎల్ నుంచి ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేయనున్నారు. మిగతా 2లో...




## ఎన్నికల నాటికి విద్యుత్ ఛార్జీలు తగ్గించడమే లక్ష్యం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : రాబోయే ఎన్నికల నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగానే వినియోగదారులకు భారీ ఊరటనిస్తూ యూనిట్‌కు రూపాయి చొప్పున ఛార్జీలను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. మిగతా 3లో...



# దళిత సంస్కృతి వైభవాన్ని చాటిన బీజేపీ



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : దళితుల ఆత్మగౌరవం, అంబేద్కర్ ఆశయాల ప్రచారం, సంప్రదాయ కళల పరిరక్షణ లక్ష్యాలతో బీజేపీ ఎస్సీ మోర్చా విజయవాడలో నిర్వహించిన "డప్పుల భారత్ ప్రదర్శన" విశేష ఆదరణ పొందింది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది డప్పు కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి కళా వైభవాన్ని చాటిచెప్పడమే కాకుండా సమాజంలో వారికి గౌరవప్రదమైన స్థానం కల్పించాలనే సంకల్పాన్ని బీజేపీ ఎస్సీ మోర్చా చాటిచెప్పింది. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలకు ముగింపుగా నిర్వహించిన ఈ భారీ ప్రదర్శన దళిత చైతన్యానికి, సామాజిక సమానత్వ సందేశానికి ప్రతీకగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల డప్పు కళాకారులను ఒకే వేదికపై సమీకరించి, వారి కళకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చేందుకు అహర్నిశలు శ్రమించిన ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ మరియు ఆయన బృందం నిజంగా అభినందనకు అర్హులు. సంవత్సరాల తరబడి సమాజం కోసం తమ కళను అందించినా అర్హమైన గౌరవం అందుకోలేకపోయిన డప్పు కళాకారుల వేదనను అర్థం చేసుకుని, వారి హక్కుల కోసం బలంగా గొంతెత్తిన ఎస్సీ మోర్చా చర్య నిజమైన సామాజిక న్యాయానికి నిదర్శనంగా నిలుస్తోంది. కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా పెన్షన్లు, గుర్తింపు కార్డులు, ప్రభుత్వ పోస్టులు, దేవాలయాల్లో స్థానం వంటి ఆచరణాత్మక డిమాండ్లను ముందుకు తెచ్చి దళిత కళాకారుల జీవితాలను మార్చే దిశగా అడుగులు వేస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా కృషి, బాబాసాహెబ్ అంబేద్కర్ కలలుగన్న సమానత్వపు సమాజ నిర్మాణానికి నిజమైన నివాళిగా చరిత్రలో నిలిచిపోతుంది. మిగతా 2లో...

- బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి ముగింపు వేడుకలు
- దళిత సంస్కృతికి జాతీయ వేదిక కల్పించిన బీజేపీ
- డప్పుల భారత్ ప్రదర్శన నూతన చరిత్ర
- 2000 మంది డప్పు కళాకారులతో దద్దరిల్లిన బెజవాడ
- అంబేద్కర్ ఆశయాలకు నిజమైన వారసులం మేమే - బీజేపీ
- బడుగు వర్గాల బతుకులు మార్చేందుకు బీజేపీ సంకల్పం
- సమానత్వపు సమాజ నిర్మాణమే లక్ష్యం
- బీజేపీ ఎస్సీ మోర్చా దళిత చైతన్య యాత్ర విజయవంతం



# ఎన్నికల నాటికి విద్యుత్ ఛార్జీలు తగ్గించడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

'దేశంలో ట్రూఅప్ పేరిట ఛార్జీలు పెరుగుతుంటే.. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో ట్రూడౌన్ విధానం ద్వారా విద్యుత్ ఛార్జీలను తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన తప్పుడు విధానాల వల్ల విద్యుత్ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సంస్కరణలు, ప్రక్షాళన చర్యల వల్ల సానుకూల ఫలితాలు వస్తున్నాయి. భవిష్యత్తు విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పునరుద్పాదక విద్యుత్ రంగాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. సీఎం చంద్రబాబు నాయుడు.. కేంద్ర ప్రభుత్వంతో జరిపిన ప్రత్యేక సంప్రదింపుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో 20 లక్షల ప్రధానమంత్రి సూర్యఘర్ కనెక్షన్లు మంజూరయ్యాయి. సామాన్యుడికి సైతం నాణ్యమైన, అంతరాయం లేని కరెంటును అత్యంత తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం అడుగులు వేస్తోంది' అని మంత్రి పేర్కొన్నారు.

# తిరుమల శ్రీవారిని ఒకే టికెట్‌పై మూడు రోజులు దర్శనం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : తిరుమల శ్రీవారిని ఒకే టికెట్‌పై వరుసగా మూడు రోజుల పాటూ దర్శనం చేసుకునే అద్భుత అవకాశం భక్తులకు వచ్చింది. తిరుమలలో ఆగస్టు నెలలో నిర్వహించే పవిత్రోత్సవాల్లో భాగంగా భక్తులకు అవకాశం దక్కింది.

పవిత్రోత్సవాలలో భాగంగా మూడు రోజుల పాటూ ఒకే టికెట్‌పై శ్రీవారి మూలమూర్తిని దర్శించుకునేందుకు భక్తులు టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. తిరుమలలో జరిగే ఈ సేవలో పాల్గొలనుకునే భక్తులకు ఈ నెల 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ప్రత్యేకంగా టికెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేయనుంది. 21న ఉదయం 10 గంటలకు టీటీడీ పవిత్రోత్సవాల టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వార్షిక పవిత్రోత్సవాల (23-08-26 నుంచి 25-08-26) టికెట్లను కూడా మే 21 ఉదయం 10గం. ఆన్లైన్ లో విడుదల చేస్తారని టీటీడీ తెలిపింది.

భక్తులు ఈ టికెట్‌ను ఇద్దరికీ కలిపి రూ.5,000 చెల్లించి కొనుగోలు చేయాలి. ఈ టికెట్లు పొందిన భక్తులు తిరుమలలో నిర్వహించే పవిత్రోత్సవాలు జరిగే మూడురోజులు స్నపన తిరుమంజనంలో పాల్గొనే అవకాశం ఇస్తారు. అంతేకాదు పవిత్రోత్సవాలలో భాగంగా చివరిరోజు పూర్ణాహుతిలోకూడా పాల్గొనవచ్చు. తిరుమలలో పవిత్రోత్సవాల్లో పాల్గొనే భక్తులు ఉదయం 7 గంటలకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1 దగ్గరకు సంప్రదాయ వస్త్రధారణతో చేరుకుని ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును చూపిస్తే అనుమతిస్తారు. తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆగస్టు 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలు ఆగస్టు 22న అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. తిరుమల శ్రీవారి ఆలయంలో ఏడాది పొడవునా జరిగే అర్చనలు, ఉత్సవాల్లో భక్తులు, సిబ్బంది వల్ల తెలియక కొన్ని దోషాలు జరుగుతాయి. టీటీడీ ఆగమశాస్త్రం ప్రకారం దోషాలు వల్ల ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఈ మేరకు టీటీడీ ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది.

# పదో తరగతి విద్యార్థులకు మంత్రి టీజీ భరత్ ప్రత్యేక విందు..



**కర్నూలు (జర్నలిస్ట్ పైల్)** : నియోజకవర్గంలో పదో తరగతిలో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు మంత్రి టీజీ భరత్ గుప్తా ప్రత్యేక విందు ఇచ్చారు. టాప్-5లో నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. కర్నూలులోని తన ఇంటికి వారిని ఈరోజు (ఆదివారం) లంచ్‌కు ఆహ్వానించారు మంత్రి టీజీ భరత్. ఈ సందర్భంగా పిక్కిలి లిఖిత (593), పింజరి గిరీష (591), మీసాల మేఘన (587), గాజుల రోహిత (582), కురువ మల్లికార్జున (581)ను అభినందించారు. వారి కుటుంబ నేపథ్యం సహా బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

భవిష్యత్తులోనూ ఇదే విధంగా కష్టపడి చదవాలని, మంచి మార్కులు సాధించాలని మంత్రి భరత్ సూచించారు. మంత్రి నారా లోకేశ్ ఎంతో కృషి చేస్తూ విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకొస్తున్నారని చెప్పారు. లోకేశ్ ఆలోచనా విధానం వల్లే విద్యార్థులు మంచి మార్కులు సాధించారని టీజీ భరత్ చెప్పుకొచ్చారు. కాగా, మంత్రి తమను ఇంటికి పిలవడంపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. టీజీ భరత్‌తో కలిసి భోజనం చేయడంపై ఉప్పొంగిపోయారు. ఉన్నత చదువుల్లోనూ ఇలాగే కష్టపడి చదివి తల్లిదండ్రులకు, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకొస్తామని మంత్రి భరత్‌కు హామీ ఇచ్చారు.

# రాష్ట్రంలో భానుడి భగభగలు...




**అమరావతి (జర్నలిస్ట్‌పైల్)** : తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. వచ్చే వారం రోజులపాటు భానుడు తన ప్రతాపం చూపించనున్నాడని, ఎండల తీవ్రతతో పాటు వడగాలులు బలంగా వీచే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా ఈ నెల 19 నుంచి 24 వరకు ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ ఆరు రోజుల కాలంలో సగటు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటిపోతాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.

**పలు కీలక సూచనలు** : తీవ్రమవుతున్న ఎండల నేపథ్యంలో నిపుణులు, వైద్యులు పలు కీలక సూచనలు చేశారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య కాలంలో ఎండ తీవ్రత గరిష్ఠంగా ఉంటుందని, ఆ సమయంలో అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని హెచ్చరించారు. ఈ సీజన్‌లో వీచే వడగాల్పుల వల్ల వడదెబ్బ తగిలి ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు తెలిపారు. ప్రయాణాలు చేసేటప్పుడు, బయటకు వెళ్లేటప్పుడు వెంట తప్పనిసరిగా తాగునీరు ఉంచుకోవాలని సూచించారు. కాటన్ దుస్తులు ధరించడం, కొబ్బరిబొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి ఎక్కువగా తీసుకోవడం ద్వారా శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటుందని చెప్పారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు ఈ వారం రోజులపాటు ఎండకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లో ఉండాలని వైద్యులు సూచించారు.

# పొగాకు రైతుల ప్రయోజనాలు కాపాడండి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలోని 43వేల మంది పొగాకు రైతులు, పొగాకు ఉత్పత్తుల రంగంపై ఆధారపడ్డ లక్షల మంది కార్మికుల ప్రయోజనాల్ని కాపాడాలని కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. మార్కెట్‌ను స్థిరీకరించేలా.. సిగరెట్లపై పెంచిన పన్ను విధానాన్ని, ఎక్సైజ్ డ్యూటీని పునఃసమీక్షించాలని కోరుతూ కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్‌లకు ఆదివారం వేర్వేరుగా లేఖలు రాశారు. రాష్ట్రంలో వర్జీనియా పొగాకు రైతుల సమస్యలను అందులో పేర్కొన్నారు. "ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటి నుంచి సిగరెట్లపై సవరించిన పన్నుల విధానంగా వల్ల పొగాకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సిగరెట్లపై జీఎస్టీని 28% నుంచి 40 శాతానికి పెంచడంతో పాటు, కేటగిరీ, పొడవును బట్టి ఎక్సైజ్ డ్యూటీని పెంచడం రైతుల ప్రయోజనాల్ని దెబ్బతీస్తోంది. జీఎస్టీ, ఎక్సైజ్ డ్యూటీ, నేషనల్ కెలామిటీ కాంటింజెంట్ డ్యూటీ లాంటి 'టాక్స్ ఆన్ టాక్స్' పన్ను పెంపు ప్రభావంతో మార్కెట్‌లో కొనుగోళ్లు మందగించాయి. గతేడాది వేలంలో కిలో పొగాకు ప్రారంభ ధర రూ.280 ఉంటే ప్రస్తుతం రూ.250కి పడిపోయింది" అని చంద్రబాబు వివరించారు. పొగాకు కొనుగోలు చేసే కంపెనీలూ కొనుగోళ్ల పరిమాణాన్ని తగ్గించుకోవడంతో రైతులు నష్టపోతున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. "అంతర్జాతీయంగా ఏర్పడిన భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎగుమతిదారులూ ఇబ్బందులు పడుతున్నారు. చట్టబద్ధమైన ఉత్పత్తులపై పన్నులు మితిమీరితే మార్కెట్‌లోకి అక్రమంగా ఉత్పత్తులు వచ్చే ప్రమాదం ఉంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

పీపీసీసీ ఏర్పాటుకు సహకరించండి

రాష్ట్రంలో ప్రాన్ ప్రొడ్యూసర్స్ కో-ఆర్డినేషన్ కమిటీ (పీపీసీసీ) ఏర్పాటుకు ఎన్ఎఫ్‌డీబీ ద్వారా రూ.వంద కోట్ల కార్పస్ ఫండ్ మంజూరుచేయాలని కేంద్రానికి చంద్రబాబు మరో లేఖ రాశారు. సాయుధ దళాల ఆహారంలో రొయ్యలను చేర్చేలా నిర్ణయం తీసుకోవాలని, ఆక్వా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేలా అమెరికాతో చర్చించాలని విజ్ఞప్తి చేశారు. ఆస్ట్రేలియా, యూరోపియన్ యూనియన్, రష్యా లాంటి ప్రత్యామ్నాయ మార్కెట్లకు మన ఆక్వా ఎగుమతులు పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. "ఆక్వా రైతులకు చేయూత అందించేందుకు కిసాన్ క్రెడిట్‌కార్డు పరిమితిని రూ.లక్షకు పెంచాలి. ఉత్తరాది రాష్ట్రాలకు రొయ్యల రవాణా కోసం ప్రత్యేక రైలు, ఏపీలో అదనపు రీజినల్ ఫిషరీస్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలి. వర్కింగ్ క్యాపిటల్ పరిమితుల్ని 30 శాతానికి పెంచడంతో పాటు వడ్డీ చెల్లింపులపై 240 రోజుల మారటోరియం, 5% వడ్డీ, 5 శాతం జీఎస్టీ నుంచి తాత్కాలికంగా మినహాయింపు ఇవ్వాలి" అని కోరారు.

# ఆర్టీసీ ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకుంటాం

- **ఏపిపిటిడి (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్**

**విజయవాడ(జర్నలిస్ట్‌పైల్)** : విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని ఏపిపిటిడి (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ హెచ్చరించింది. ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య విమర్శించారు.

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ అసలు ఆలోచనలను బయటపెట్టాయని వారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల విలువైన ఆర్టీసీ ఆస్తులు, డిపోలు ఉండగా విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికే కొన్ని డిపోలను లీజుకు ఇచ్చారని, మరికొన్నింటిని అప్పగించే చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పే ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చిస్తూనే, రోజుకు సుమారు 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న ప్రజా రవాణా సంస్థ ఆర్టీసీ బలోపేతానికి మాత్రం నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు.

స్త్రీ శక్తి, దివ్యాంగ శక్తి పథకాల కింద ప్రభుత్వం ఆర్టీసీకి ప్రతి నెల సుమారు రూ.300 కోట్లు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.160 కోట్ల మేర మాత్రమే రీయింబర్స్‌మెంట్ ఇస్తోందని తెలిపారు. పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేస్తే ఆర్టీసీ స్వయంగా ఎలక్ట్రిక్, సిఎన్‌జీ బస్సులను కొనుగోలు చేసుకునే సామర్థ్యం కలిగి ఉందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర చేసిన "రాష్ట్ర ఆదాయం ఉద్యోగుల జీతాలకే సరిపోతోంది" అన్న వ్యాఖ్యలను వారు ఖండించారు. ఉద్యోగులు చేసిన పనికి జీతాలు తీసుకుంటున్నారే తప్ప ఉచితంగా పొందడం లేదన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలో ఆర్టీసీని పూర్తి స్థాయిలో జాతీయకరణ చేసి గ్రామీణ ప్రాంతాలకు రవాణా సేవలు విస్తరించారని, ప్రస్తుతం మాత్రం ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని విమర్శించారు. ఆర్టీసీని కాపాడేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. గత 14 ఏళ్లుగా ఆర్టీసీలో నియామకాలు చేపట్టలేదని, ప్రస్తుతం ఉన్న 10 వేల ఖాళీలను జాబ్ క్యాలెండర్‌లో చూపకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల వద్ద నిర్వహించిన ధర్నాలు విజయవంతమయ్యాయని పేర్కొంటూ, ఈ నెల 18న అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 26న విజయవాడలో అన్ని ఉద్యోగ సంఘాలు, ట్రేడ్ యూనియన్లతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

# మోటార్ సైకిల్ వద్దు -సైకిల్ ముద్దు'

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన 'పొదుపు' పిలుపుకు స్పందిస్తూ నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కింద మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనులు, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ తీరును స్వయంగా పరిశీలించేందుకు ఎమ్మెల్యే సైకిల్‌పై పట్టణంలో పర్యటించారు. పెట్రోల్ వాహనాలు వద్దు అనే నినాదంతో ఆయన సైకిల్ తొక్కుతూ ప్రధాన వీధులు, కాలనీల్లో తిరిగారు. ఇంధన వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, ప్రజల్లో పొదుపు స్ఫూర్తిని నింపడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సైకిల్ వాడకం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని, ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు సైకిల్‌ను ఉపయోగించాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యటనలో భాగంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి రోడ్ల శుభ్రత, చెత్త సేకరణ, డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. 'స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యం నెరవేరాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమని, అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రజాప్రతినిధి స్వయంగా సైకిల్‌పై వచ్చి పరిస్థితిని పరిశీలించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పిలుపుకు అనుగుణంగా పొదుపు, స్వచ్ఛత సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# నేడు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

- **ప్రతీ వారం రెవెన్యూ క్లినిక్**
- **మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లోనూ అర్జీల స్వీకరణ**
- **1100 కాల్ సెంటర్, ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలి**
- **జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంజన సింహ వెల్లడి**

**నరసరావుపేట(జర్నలిస్ట్ పైల్)** : జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు కలెక్టరేట్ లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంజన సింహ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్య గురించి ఖచ్చితమైన మరియు పూర్తి వివరాలతో దరఖాస్తు చేయాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు.

**అర్జీదారులు గమనించాల్సినవి:** సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అర్జీని సమర్పించాలి.గతంలో ఫిర్యాదు చేసిన వారు తప్పనిసరిగా పాత అర్జీ రసీదు తీసుకురావాలని సూచించారు.అర్జీలో పేరు, చిరునామా మరియు ఫోన్ నంబర్ స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు.

**డిజిటల్ పర్యవేక్షణ:** అర్జీదారులు తమ ఫిర్యాదు స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రభుత్వం కింది సౌకర్యాలను కల్పించిందని కలెక్టర్ వివరించారు: సమస్య పరిష్కారమైన వెంటనే అర్జీదారుని ఫోన్ నంబర్‌కు మెసేజ్ వస్తుంది. నోటీసులు, ఎండార్స్‌మెంట్లు వాట్సాప్ ద్వారా పంపడంతో పాటు, రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఇంటి చిరునామాకు కూడా పంపిస్తారు.

**మున్సిపల్/మండల స్థాయిలో:** జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా పీజీఆర్ఎస్ జరుగుతుంది. ప్రజలు తమ సమీప కేంద్రాల్లో ఫిర్యాదు చేయవచ్చు.

**'మీ కోసం' 1100 కాల్ సెంటర్:** అర్జీదారులు కలెక్టరేట్‌కు రాకుండానే తమ సమస్యలను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన 1100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించ వచ్చునని కలెక్టర్ సూచించారు. గతంలో ఇచ్చిన అర్జీల స్టేటస్ తెలుసుకోవడానికి కూడా ఈ నంబర్‌కు కాల్ చేయవచ్చునని, అలాగే, ఎవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా అర్జీలను సమర్పించవచ్చునని సూచించారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు సత్వర పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు..

**ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్** : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటలకు రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. ముగ్గురు రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్లు తప్పనిసరిగా ఉదయం 10.00 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు హాజరై వినతులను స్వీకరిస్తారని తెలిపారు. అలాగే ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించేందుకు సంబంధిత ఏఓ, డీటీ లు అందుబాటులో ఉంటారని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తమకు సంబంధించిన అన్ని రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.రైతులు మరియు ప్రజలు తమ భూసంబంధిత సమస్యలు, రెవెన్యూ సమస్యలను ఈ రెవెన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ప్లాస్టిక్ రహిత జిల్లాయే లక్ష్యంగా ముందుకు సాగాలి..



**మార్కాపురం (జర్నలిస్ట్‌పైల్)** : మార్కాపురం జిల్లాను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు అధికారులు, ప్రజలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. మార్కాపురం పట్టణంలోని అమ్మవారి శాల వీధిలో శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తో కలిసి కలెక్టర్ రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విచ్చలవిడిగా వాడుతున్న ప్లాస్టిక్ ను అరికట్టాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. దీనివల్ల పక్షులు, జంతువులు, సముద్ర జీవులు నశించిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ చెత్తను ఇంటి ముందు కానీ, ఆరుబయట వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శుభ్రతే ఆరోగ్యానికి మొదటి అడుగని కలెక్టర్ అభివర్ణించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేసి స్వచ్ఛ మార్కాపురాన్ని సాధిద్దామన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకట శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు

# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు వెంటనే చెల్లించాలి

**విజయవాడ (జర్నలిస్ట్ పైల్)** : రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని జేఏసీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న డైరెక్ట్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, ఓటీ టెక్నీషియన్లు తదితర ఉద్యోగులకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, రెండో ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు సహా సుమారు 186 క్యాడర్లలో పనిచేస్తున్న 22 వేల మందికి ఇప్పటివరకు జీతాలు అందలేదని తెలిపారు.

ఆరోగ్య మిత్రలకు రెండు నెలల వేతన బకాయిలు ఉన్నాయని, సంక్షేమ శాఖలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ టీచర్లకు కూడా అనేక నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. సోషల్ వెల్ఫేర్ శాఖలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి ఐదు నెలలుగా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టర్ల ద్వారా పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు బకాయిలుగా ఉన్నాయని పేర్కొన్నారు.

అత్యల్ప వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులు నెలనెలా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇతర శాఖల్లో కూడా వేతన బకాయిల సమస్య కొనసాగుతోందన్నారు.

కూటమి ప్రభుత్వం నెలనెలా వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా అమలు కావడం లేదని జేఏసీ నాయకులు విమర్శించారు. వెంటనే అన్ని శాఖలు, సంస్థల్లో పెండింగ్ వేతనాలు విడుదల చేయడంతో పాటు ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ ప్రకటనపై హనరరీ జేఏసీ చైర్మన్ ఏ.వి.నాగేశ్వరావు, జేఏసీ చైర్మన్ బి.కాంతారావు, కోశాధికారి డి.దయామణి, సెక్రటరీ జనరల్ పి.వెంకటసుబ్బయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజఫర్ అహ్మద్ సంతకాలు చేశారు.

# కార్మికుల ఆరోగ్యం పట్ల యాజమాన్యాలు శ్రద్ధ వహించాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా కార్మికుల ఆరోగ్యం పట్ల యాజమాన్యాలు శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ స్పష్టం చేశారు. వేసవి ఎండ తీవ్రత పట్ల కార్మికులు కూడా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వేసవిలో ఎండ తీవ్రత పట్ల రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ ఎప్పటికప్పుడు సూచనలు అందిస్తుందని, దానిని అనుసరించి తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్మికుల రక్షణకు యాజమాన్యాలు ప్రత్యేక చొరవ చూపాలని, కార్మికుల ఆరోగ్యమే సంస్థ ఆరోగ్యంగా భావించాలని అన్నారు. కర్మాగారాలు, దుకాణాలలో పనిచేసేవారు, భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు తదితర రంగాల కార్మికులు పని ప్రదేశాలలో లభ్యంగా ఉన్న సౌకర్యాల మేరకు స్వీయ రక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్మికుల పని ప్రదేశాలలో తాగు నీరు, నీడ, వసతిని యాజమాన్యాలు కల్పించాలని ఆదేశించారు. పని ప్రదేశాలలో మజ్జిగ. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్స్, అత్యవసర మందులు, గర్భిణి స్త్రీలు, వయసు మీరిన కార్మికుల కోసం మరిన్ని జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. అత్యవసర వైద్య సహాయం సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న రోజుల్లో పని వేళలను మధ్యాహ్నం 12 నుండి 4 గంటల వరకు లేకుండా సమయాలను మార్పులు చేయాలని అన్నారు. డీ హైడ్రేషన్ నివారణ మార్గాలపై కార్మికులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్మికులకు ప్రతి గంట పని తరువాత 5 నిమిషాలు విశ్రాంతి ఇవ్వాలని ఆదేశించారు. గుంటూరు జిల్లాలో ఉష్ణ సూచికపై మండల స్థాయి అంచనాలు మరియు ముందు జాగ్రత్త చర్యలతోపాటు అత్యవసర పరిస్థితులు, సమాచారం కోసం పౌరులు 24/7 పనిచేసే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ టోల్-ఫ్రీ నంబర్లు: 1070ని సంప్రదించవచ్చని చెప్పారు. తీవ్రమైన వేడి పరిస్థితులలో రియల్ టైమ్ సమాచారం, అత్యవసర సహాయ సూచనలు అందిస్తాయని చెప్పారు.

# ఏపీలో కళ్యాణలక్ష్మి పథకం



- **కుమార్తెల వివాహానికి పావలా వడ్డీకే రుణం**
- **అర్హతలు, దరఖాస్తు వివరాలివే**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు.. ఇది పెద్దలు చెప్పే మాట. ఇల్లు కట్టాలన్నా, పెళ్లి చేయాలన్నా పేద, మధ్యతరగతి జీవులకు మహా కష్టం. ఆర్థికపరమైన విషయాల నుంచి అనేక అంశాలపై ఈ రెండూ ఆధారపడి ఉంటాయి.

ఈ నేపథ్యంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉండేందుకు ఏపీ ప్రభుత్వం ఓ ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ పథకం కింద డ్వాక్రా సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళలకు లక్ష రూపాయల వరకూ రుణం ఇవ్వాలని నిర్ణయించారు. డ్వాక్రా మహిళలకు వారి కుమార్తెల వివాహం కోసం ఈ మొత్తాన్ని పావలా వడ్డీ రుణంగా అందిస్తారు. త్వరలోనే ఈ పథకం అమల్లోకి రానుంది.

**కళ్యాణలక్ష్మి పథకం.. దరఖాస్తు విధానం:** ఈ పథకం కింద లబ్ధి పొందాలంటే డ్వాక్రా సంఘంలో సభ్యత్వం ఉండాలి. సదరు మహిళ ఏదైనా డ్వాక్రా సంఘంలో కనీసం ఆరు నెలలు సభ్యురాలిగా ఉండాలి. అలాగే ఆ డ్వాక్రా సంఘం ఏ లేదా బీ గ్రేడ్ గుర్తింపు ఉండాలి. అలాగే బ్యాంకు నుంచి గతంలో రుణాలు ఏవైనా పొంది ఉంటే.. వాటిని సక్రమంగా చెల్లించాలి. ఇక పెళ్లి కుమార్తె వయసు 18 ఏళ్లు పూర్తి అయ్యి ఉండాలి. అర్హులైన వారు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. పెళ్లి శుభలేఖ లేదా రిజిస్ట్రేషన్ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

దరఖాస్తు చేసిన తర్వాత కొన్ని రోజుల వ్యవధిలోనే డ్వాక్రా సభ్యురాలి బ్యాంక్ ఖాతాలలో డబ్బులు జమ చేస్తారు. కనిష్టంగా పది వేల రూపాయల నుంచి గరిష్టంగా రూ.లక్ష వరకూ రుణంగా అందిస్తారు. మరోవైపు ఈ పథకాన్ని త్వరలోనే ప్రారంభించనున్నారు. ఈ పథకానికి సంబంధించి గ్రామాల్లోని డ్వాక్రా మహిళలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కళ్యాణలక్ష్మి పథకం అమలు కాగానే.. అర్హులైన వారితో దరఖాస్తు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పథకం అమల్లోకి వస్తే వివాహాల కోసం మధ్యతరగతి కుటుంబాలు అధిక వడ్డీలకు అప్పులు చేసి.. ఇబ్బందులు పడే పరిస్థితులు తప్పుతాయని అధికారులు చెప్తున్నారు. అయితే ఎప్పటి నుంచి ఈ పథకం అమలు చేస్తారనేదీ ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది.

## స్టేషన్‌కే ఆలయ కళ, చిన్న తిరుపతి మాదిరిగా మారిన ఏలూరు రైల్వే జంక్షన్




ఏలూరు, జర్నలిస్ట్ ఫైల్: ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే రంగానికి కొత్త రూపు తీసుకొస్తున్న అమృత్ భారత్ స్టేషన్ పథకం ఇప్పుడు ఏలూరును మరోసారి ప్రత్యేకంగా నిలబెట్టింది. ఒకప్పుడు సాధారణ ప్రయాణికుల రాకపోకలకే పరిమితమైన ఏలూరు రైల్వే స్టేషన్, ఇప్పుడు ఆధ్యాత్మిక శోభతో మెరిసిపోతూ అందరినీ ఆకట్టుకుంటోంది. స్టేషన్ భవనం ముందు నిలబడి చూస్తే అది రైల్వే స్టేషన్ కంటే ఒక ప్రసిద్ధ దేవాలయ ప్రవేశ ద్వారం అనిపించేలా రూపుదిద్దుకోవడం విశేషం. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఏలూరు స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో పాటు సాంప్రదాయ శైలిని కలగలిపి అభివృద్ధి చేశారు.ముఖ్యంగా స్టేషన్ ప్రవేశ ద్వారాన్ని ద్వారక తిరుమల ఆలయ గాలి గోపురాన్ని తలపించేలా తీర్చిదిద్దడం స్థానికులను మాత్రమే కాదు, ప్రయాణికులను కూడా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గోపురం ఆకృతి, సంప్రదాయ శిల్ప శైలి, రాత్రివేళల్లో మెరిసే ఆధునిక లైటింగ్ కలసి స్టేషన్‌కు ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చాయి.స్టేషన్ అంతర్గత భాగంలో కూడా ప్రాంతీయ సంస్కృతి ప్రతిబింబించేలా ప్రత్యేక డిజైన్‌లు రూపొందించారు. వెయిటింగ్ హాళ్లు, విశాలమైన ప్లాట్‌ఫామ్‌లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, డిజిటల్ సౌకర్యాలు వంటి అంశాలను ఎయిర్‌పోర్టు స్థాయిలో ఏర్పాటు చేస్తూనే, స్థానిక కళా సంపదను ప్రతిబింబించే అలంకరణలకు ప్రాధాన్యత ఇచ్చారు.ప్రయాణికులకు సౌకర్యం, సందర్శకులకు ఆహ్లాదం రెండూ కలిసేలా స్టేషన్‌ను తీర్చిదిద్దిన తీరు ఇప్పుడు ప్రశంసలు అందుకుంటోంది.ఏలూరు ప్రజలకు ద్వారక తిరుమల కేవలం ఒక ఆలయం మాత్రమే కాదు. అది భక్తి, విశ్వాసానికి ప్రతీక. "చిన్న తిరుపతి"గా పేరుగాంచిన ఈ ఆలయానికి ప్రతి రోజు వేలాది మంది భక్తులు చేరుకుంటుంటారు. వారిలో చాలామంది ఏలూరు రైల్వే స్టేషన్ ద్వారానే ప్రయాణం కొనసాగిస్తారు. అలాంటి నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని స్టేషన్ ప్రవేశ ద్వారాన్ని ఆలయ శైలిలో అభివృద్ధి చేయడం భక్తుల్లో మరింత ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తోంది.ఇటీవల రైల్వే శాఖ సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన ఏలూరు స్టేషన్ చిత్రాలు విస్తృతంగా వైరల్ అయ్యాయి. "ఇది నిజంగా రైల్వే స్టేషనేనా" అంటూ నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండగా, ప్రయాణికులు రైల్వే శాఖ పనితీరును అభినందిస్తున్నారు. ఆధునికతకు సంస్కృతిని జోడిస్తే ఎలా ఉంటుందో ఏలూరు స్టేషన్ ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో 70కి పైగా రైల్వే స్టేషన్లు అభివృద్ధి దశలో ఉన్నాయి. ప్రతి స్టేషన్‌కు స్థానిక ప్రత్యేకతను జోడిస్తూ అభివృద్ధి చేయడం ఈ పథకం ప్రత్యేకతగా మారింది. ఆ జాబితాలో ఏలూరు స్టేషన్ ఇప్పుడు ప్రత్యేక గుర్తింపు సంపాదిస్తోంది. ఈ అభివృద్ధి వల్ల రైల్వే ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, ఏలూరు నగరానికి పర్యాటక పరంగా కూడా కొత్త గుర్తింపు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఇంకొన్ని రోజుల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ స్టేషన్‌ను చూసేందుకు స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.రైలు ఎక్కేందుకు వచ్చే ప్రయాణికులే కాదు. నగరానికి వచ్చే సందర్శకులు కూడా ఇకపై ఏలూరు స్టేషన్‌ను ఒక ప్రత్యేక ఆకర్షణగా చూసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న యువతికి ఎంపీ సహాయం

- ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న నూజివీడు మండలానికి చెందిన యువతి
- వ్యాధి కారణంగా శుష్కించి ఎముకల గూడులా మారిన శరీరం



ఏలూరు, జర్నలిస్ట్ ఫైల్: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. నూజివీడు మండలం 'పోలసానిపల్లి' గ్రామానికి చెందిన 25 సంవత్సరాల స్వాతి అనే యువతి తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతోంది. గత కొంతకాలంగా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదు. ఈ పరిస్థితుల్లో తల్లీ తండ్రి లేని ఆమె, తన పెదనాన్నను తోడుగా తీసుకుని శుక్రవారం రాత్రి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను ఆయన నివాసంలో కలిసి తన ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులను వివరించింది. తీవ్ర ఆయాసంతో, మాట్లాడటానికి కూడా ఇబ్బంది పడుతూ తన సమస్యను చెబుతున్న ఆమె పరిస్థితిని చూసి ఎంపీ చలించారు. 25 ఏళ్ల వయసున్న ఆమె ఊపిరితిత్తుల వ్యాధితో శరీరం ఎముకల గూడులా మారడంతో 10 ఏళ్ల బాలిక స్థాయికి శరీరం కృశించిపోయింది. ఆమె పరిస్థితిని చూసి చలించిపోయిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెంటనే అప్పటికప్పుడు తక్షణ ఆర్థిక సహాయంగా 20 వేల రూపాయలు అందించడమే కాకుండా ఆమెకి మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కొద్ది సమయం కూడా నిలబడలేకపోతున్న స్వాతి పరిస్థితిని గమనించి, ఒక మూడు చక్రాల వాహనాన్ని కూడా అందిస్తానని హామీ ఇచ్చిన ఎంపీ, ప్రభుత్వంతో మాట్లాడి ప్రత్యేక కేటగిరీ కింద పెన్షన్ ఇప్పించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉంటూ మెరుగైన వైద్యం చేయించుకోవాలని ఆమెకు సూచించారు. పేదరికం కారణంగా వైద్యం చేయించుకోలేని పరిస్థితి రాష్ట్రంలో ఎవరికీ రాకూడదనే ధ్యేయంతో కూటమి ప్రభుత్వం వైద్య రంగంపై దృష్టి పెట్టి ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు అనేక ఉచిత వైద్య పథకాలు తీసుకువచ్చిందన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. తాను కూడా ఏలూరు సహా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నానని, అధునాతన వైద్య పరికరాలు అందించే ఏర్పాటు చేస్తున్నానని చెప్పారు. సహాయం కోసం ఇప్పటి వరకూ ఎంతోమంది నాయకుల వద్దకు వెళ్లినప్పటికీ ఈ విధమైన సహాయం, భరోసా ఎక్కడా లభించలేదని చెబుతూ ఆ యువతి, ఆమె పెదనాన్న ఇద్దరూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు కన్నీటితో కృతజ్ఞతలు తెలిపారు.

## జె.సి.అస్మిత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా జె.సి.ఎస్.వై ఎం.పి. ఎల్. క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



యాడికి మే అనంతపురం జర్నలిస్ట్ ఫైల్: మండల కేంద్రమైన యాడికిలో తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి.అస్మిత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ ను టీడీపీ నాయకులు మరియు జె.సి. అభిమానుల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ మైదానం నందు ఘనంగా ప్రారంభించడం జరిగినది.మండల కూటమి నాయకులు ముందుగా క్రీడాకారుల సమక్షంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే జె.సి.అస్మిత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.మొత్తం క్రికెట్ టోర్నమెంట్ కు 53 జట్లు పాల్గొనగా టోర్నీ ప్రారంభం సందర్భంగా శ్రీరామ్ లెవెన్స్ జట్టు, బాల గణేష్ జట్టు తలపడగా మొదట బ్యాటింగ్ ఎంచుకున్న బాల గణేష్ జట్టు నిర్ణీత 10 ఓవర్ల లో 120 పరుగులు సాధించగా తరువాత బరిలోకి దిగిన శ్రీరామ్ లెవెన్స్ జట్టు 95 పరుగులు చేసి ఓటమి చెందింది . రెండవ మ్యాచ్ లో చింతలాయపల్లి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 133 పరుగులు సాధించగా వేములపాడు జట్టు 85 పరుగులు సాధించి ఓటమి చెందింది.. మూడవ మ్యాచ్ లో ఉప్పలపాడు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 136 పరుగులు సాధించగా చందన 89 పరుగులు సాధించి ఓటమి చెందింది .. నాలుగవ మ్యాచ్లో సుధా లెవన్స్ పెద్దపేట జట్టు 104 పరుగులు సాధించగా పచ్చారు మేకులపల్లి జట్టు 67 పరుగులు సాధించి ఓటమి చెందింది...ఐదవ మ్యాచ్ లో జూనియర్స్ విభాగంలో విజన్ స్కూల్ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 82 పరుగులు సాధించగా తూట్రాళ్లపల్లి జట్టు నిర్ణిత ఎనిమిది ఓవర్లలో 71 పరుగులు సాధించి విజన్ జట్టు చేతిలో ఓటమి చెందింది . టోర్నీ నిర్వాహకులు మాట్లాడుతూ తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి.అస్మిత్ రెడ్డి జన్మదిన సందర్భంగా మండల యువతలో ఉత్సాహం నింపడానికి ఈ టోర్నీ పెట్టడం జరిగిందని, మండల వ్యాప్తంగా దాదాపు 700 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, ఇందులో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి 30 వేల రూపాయలు టీడీపీ మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ , రెండవ బహుమతి 20వేల రూపాయలు సీనియర్ టిడిపి నాయకులు గొర్తి రుద్రమ నాయుడు ,మూడో బహుమతి టి.డి.పి. టౌన్ ప్రెసిడెంట్ వెలిగండ్ల ఆదినారాయణ అందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. అలాగే క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్, బెస్ట్ బాట్స్మన్, బౌలర్ ట్రోఫీలను మరియు టోర్నమెంట్ నిర్వహణ ఖర్చులను విశ్వం విజన్ విద్యాసంస్థలవారు వారి యొక్క టీం అందిస్తున్నారని తెలపడం జరిగింది...అలాగే క్రీడాకారుల దాహార్తిని తీర్చుకోవడానికి , జనసేన పార్టీ యాడికి మండలం వారు కూల్ ప్యూరిఫైడ్ నీరు అందించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం సీనియర్ నాయకులు, కార్యకర్తలు జె.సి. అభిమానులు, క్రీడాకారులు, పాల్గొన్నారు.



## రైతుల పంటలకు మద్దతు ధరల పెంపు మోసపూరితం

- ఎరువుల ధరలు 20 శాతం పెంచి, పంటల మద్దతు ధరలు 8 శాతం మాత్రమే పెంచుతారా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ విమర్శ




ఏలూరు, జర్నలిస్ట్ ఫైల్: రైతుల పంటలకు మద్దతు ధరల పెంపు మోసపూరితమని, ఎరువుల 20 శాతం పెంచి పంటల మద్దతు ధరలు కేవలం 8 శాతం మాత్రమే పెంచి కేంద్ర ప్రభుత్వం రైతులను మోసగించిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. సూర్యనారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. శనివారం ఏలూరు పవర్ పేట అన్నే భవనంలో కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలపై వారు మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 14 వ్యవసాయ పంటలకు మద్దతు ధరలు ప్రకటించిందన్నారు.కనిష్టంగా వరికి 3శాతం ( గ్రేడ్ ఏ రకం వరికి 2,389 నుండి 2,461), వేరుశనగ 3.5 శాతం (7,263 నుండి 7,517), మొక్కజొన్న 00.1 శాతం (2,400 నుండి 2,410) గరిష్టంగా పొద్దుతిరుగుడు 8.1 శాతం (7,721 నుండి 7,343), జొన్నలు 8.6 శాతం 3749 నుండి 4,073) కు ఇలా రానున్న ఖరీఫ్ సీజన్ కు 14 రకాల వ్యవసాయ పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచుతూ చేసిన నిర్ణయం రైతులను మరోసారి మోసం చేసేదిగా ఉన్నన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల పెట్టుబడిపై 50 శాతం ఆదాయం కలిపి ఈ ధరలు నిర్ణయించినట్లు రైతులకు ఈ మద్దతు ధర పెద్ద ఊరట ఇస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఇంతకు మించిన దగా మరొకటి లేదని విమర్శించారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెంచేందుకు సరిగ్గా వారం రోజుల ముందు కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచుకునేందుకు ఎరువుల కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. కాంప్లెక్స్ ఎరువుల పైన ఒక్కొక్క బస్తాపై సగటున 200 రూపాయల నుండి 300 రూపాయలు ( క్వింటాలుకు రూ. 400/- నుండి రూ.600 లు ) వరకు ధరలు పెంచుకునేందుకు ఎరువుల కంపెనీలకు కేంద్రం అనుమతి ఇచ్చిందని చెప్పారు. ఎరువుల ధరలపై సుమారు 15 నుండి 20శాతం వరకు ఎరువుల ధరలు పెరిగాయాన్నారు. యుద్ధం బూచి చూపి ఎరువుల కంపెనీలు 20: 20: 0: 13 పై 1,500 రూపాయల నుండి 1,800 కు ధర పెంచాయని,10: 26: 26: ఎరువుల బస్తాపై రూ.2,025 నుండి రూ. 2,250 లకు ఎరువుల కంపెనీలు ధరలు పెంచాయన్నారు. ఈ రకంగా ఎరువుల ధరలపై 15 శాతం నుండి 20 శాతం పైగా ధరలు పెంచుకునేందుకు ఎరువుల కంపెనీలకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన వ్యవసాయ పంటల పైన కేవలం 00.1 శాతం నుండి 8 శాతం వరకు మాత్రమే ధరలు పెంచుతూ పెట్టుబడి ఖర్చులపై 50 శాతం అదనంగా ధర నిర్ణయించినామని చెప్పడం రైతులను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సూచించినట్లుగా సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయం పై 50 శాతం అదనంగా కలిపి (సి2050 శాతం) అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలని, ధరలు నిర్ణయానికి పరిమితం కాకుండా అవి అమలు చేసి రైతుల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2025 - 26వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు మొక్కజొన్న, వరి, పత్తి, జొన్నలు, కందులు, మినుములు వంటి ఏ పంటలకు అమలు కాలేదని ఈ ఖరీఫ్ సీజన్లోనైనా కేంద్ర ప్రభుత్వం రైతులకు పంటల మద్దతు ధరల అమలు కోసం తగు చర్యలు చేపట్టాలని కోరారు. రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ పంటల మద్దతు ధరలను పునః సమీక్షించి డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయంపై 50 శాతం కలిపి ధరలు నిర్ణయించి అమలు చేయాలన్నారు. ఇదే సందర్భంలో ఎరువుల కంపెనీలు పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని, ఇప్పటికే ఎరువుల ధరలు భరించలేనంతగా పెరిగాయని రైతులను ఎరువుల కంపెనీల దోపిడీ నుండి కాపాడాలన్నారు.

### - బలవంతపు భూసేకరణ పై రైతుల పోరాటం

కొయ్యలగూడెం మండలం బోడిగూడెం,మంగపతి దేవి పేట పరిసర గ్రామాలలో ప్రతిపాదిత నేవీ ఆయుధ డిపో నిర్మాణాన్ని విరమించుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం ఇది రైతుల పోరాట విజయమని చెప్పారు. రైతుల అనుమతి లేకుండా బలవంతపు భూసేకరణకు పాల్పడడం దుర్మార్గమన్నారు. అభివృద్ధికి ఎవరూ వ్యతిరేకం కాదని జరిగిన అభివృద్ధిని నాశనం చేసి కొత్తగా అభివృద్ధి చేస్తామని మాయమాటలు చెప్పడం ఇదే అభివృద్ధి వ్యతిరేకమని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి భూసేకరణ నిలిపివేస్తున్నామని ప్రకటించడం సంతోషకరమన్నారు. పట్టు వదలకుండా పోరాడిన రైతులు,పరిసర గ్రామాల ప్రజలకు అభినందనలు తెలియజేశారు.

## మానవత్వం మరువని యాడికి 'మే ఐ హెల్ప్ యూ' ఫౌండేషన్

### గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న వృద్ధుడికి అంత్యక్రియలు

యాడికి అనంతపురం జర్నలిస్ట్ ఫైల్: సమాజంలో బంధాలు, అనుబంధాలు మృగ్యమైపోతున్న ఈ రోజుల్లో, తోటి మానవుడికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకుంది యాడికి చెందిన 'మే ఐ హెల్ప్ యూ' ఫౌండేషన్.మూడు రోజుల క్రితం మరణించి, గుర్తుపట్టలేని స్థితికి చేరిన ఒక వృద్ధుడి శవానికి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించి యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు మరోసారి తమ ఉదారతను చాటుకున్నారు.

### బంధువులు ముందుకు రాకపోయినా..

### అండగా నిలిచిన ఫౌండేషన్

యాడికి ప్రాంతానికి చెందిన బండి కారి మద్దిలేటి (80) అనే వృద్ధుడు మూడు రోజుల క్రితం మరణించారు. ఎండ తీవ్రత వల్లనో, ఇతర కారణాల వల్లనో శరీరం పూర్తిగా కుళ్ళిపోయి, కనీసం గుర్తుపట్టలేని అత్యంత దయనీయ స్థితికి చేరుకుంది. మృతుడికి ఒకే ఒక్క కుమారుడు ఉన్నప్పటికీ, ఒంటరిగా ఆ పరిస్థితిలో అంత్యక్రియలు నిర్వహించడం అతనికి సాధ్యం కాలేదు. పైగా మృతదేహం ఉన్న స్థితిని చూసి మిగిలిన బంధువులు గానీ, గ్రామస్థులు గానీ సాయం చేయడానికి ముందుకు రాలేదు.ఇలాంటి క్లిష్ట సమయంలో ఆ కొడుకు పడుతున్న వేదనను చూసి, స్థానికులు యాడికి 'మే ఐ హెల్ప్ యూ' ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రదించారు. "కడసారి చూపుకు నోచుకోని ఆ వృద్ధుడి దేహానికి గౌరవప్రదమైన వీడ్కోలు పలకడమే మా బాధ్యతగా భావించాము

- ఫౌండేషన్ సభ్యులు




మానవత్వంతో అంతిమ సంస్కారాలు సమాచారం అందుకున్న వెంటనే 'మే ఐ హెల్ప్ యూ' ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ, చందగాని ధ్రువనారాయణ, సాకరే శంకరప్ప, టి లక్ష్మీకాంతమ్మ, ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి ఏమాత్రం వెనుకాడకుండా రంగంలోకి దిగారు. కుళ్ళిపోయిన శవాన్ని తాకడానికి కూడా ఇతరులు భయపడుతున్న తరుణంలో, ఫౌండేషన్ సభ్యులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మృతదేహాన్ని శుభ్రం చేసి, పాడె కట్టారు. ఆ వృద్ధుడి కుమారుడిని దగ్గరుండి నడిపిస్తూ, హిందూ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు.

### వెల్లువెత్తుతున్న అభినందనలు

సమాజంలో స్వార్థం పెరిగిపోతున్న ఈ రోజుల్లో, రూపం కోల్పోయిన ఒక అనాథ శవానికి (బంధువులున్నా అనాథగా మిగిలిన పరిస్థితిలో) అంతిమ సంస్కారాలు నిర్వహించిన యాడికి 'మే ఐ హెల్ప్ యూ' ఫౌండేషన్ చేసిన ఈ కార్యం స్థానికులను ఎంతగానో కదిలించింది."కన్నవారే కాదనుకున్నా, మేమున్నామంటూ" ముందుకు వచ్చిన ఫౌండేషన్ నిర్వాహకులను, సభ్యులను యాడికి ప్రజలు మరియు పలువురు ప్రముఖులు ముక్తకంఠంతో అభినందిస్తున్నారు. సమాజంలో ఇంకా మానవత్వం బతికే ఉంది అనడానికి యాడికి యువతే నిదర్శనం అని కొనియాడుతున్నారు...

## సింహాచలం ఆలయ కమిటీలో సదుం మహిళకు స్థానం



పులిచెర్ల, జర్నలిస్ట్ ఫైల్: అన్నమయ్య జిల్లా సదుం మండలం చింతపర్తివారిపల్లికి చెందిన టిడిపి వీర మహిళ లలిత జ్యోతిని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కమిటీ సభ్యురాలిగా ప్రభుత్వం నియమించింది. దేవాదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్ లాల్ ఉత్తర్వులు జారీ చేయగా, కమిటీ చైర్మన్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజును కూడా నియమించారు. సాధారణ కుటుంబానికి చెందిన లలిత జ్యోతి చాలాకాలంగా తెలుగుదేశం పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సిఫారసుతో ఆమెకు ఈ అవకాశం లభించినట్లు తెలిసింది.పదవి రావడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన లలిత జ్యోతి, తన కృషిని గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, అలాగే చల్లా రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## పాపినేపాళ్యం.ప్రజలకు ట్యాంకర్ల నీరు అందజేసిన కూటమి ప్రభుత్వం



గార్లదిన్నె, జర్నలిస్ట్ ఫైల్: సింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు శ్రావణి ఆదేశాల మేరకు గత 15 రోజుల నుండి పాపినేపాళ్యం గ్రామం కు ట్యాంకర్ల ద్వారా నీరు అందజేస్తున్నామని మండల కన్వీనర్ పాండు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం మాజీ మంత్రి సాకే సాలజనాథ్ ఎమ్మెల్యే బండారు శ్రావణి పై తీవ్ర విమర్శలు చేయడం సరికాదని ఆయన మండిపడ్డారు.



## దోమల నివారణకు గ్రామాల్లో మందు పిచికారీ



గూడెంకొత్తవీధి, జర్నలిస్ట్ ఫైల్: అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జీకేవీధి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో రింతాడ-1 సచివాలయ పరిధిలోని అసరాడ, ఉయ్యాలమామిడి గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ప్రతి ఇంటి లోపల, బయట ఏసీఎం 5 శాతం దోమల మందును పిచికారీ చేశారు. ఈ మందు ప్రభావం సుమారు 45 రోజుల పాటు ఉంటుందని వైద్య సిబ్బంది తెలిపారు.దోమల మందు పిచికారీ వల్ల మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను నివారించవచ్చని సూచించారు. ప్రజలు తప్పనిసరిగా దోమతెరలు ఉపయోగించాలని, ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని కోరారు. ప్రతి శుక్రవారం "ఫ్రైడే--డ్రైడే" కార్యక్రమం నిర్వహిస్తూ పరిశుభ్రత పాటించాలని, కాచిన నీటిని మాత్రమే తాగాలని అవగాహన కల్పించారు.వైద్య ఆరోగ్య సిబ్బందికి ప్రజలు సహకరించి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి కె. పోతురాజు, హెల్త్ అసిస్టెంట్ ఎం. సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు దినకుమారి, రాజేశ్వరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## "సిఎం సహాయ నిధి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి"



తాడేపల్లిగూడెం జర్నలిస్ట్ ఫైల్: వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో శనివారం రూ.6,60,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లలో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సుమారు రూ.7 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి అందించామని అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో భారీగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఆపద వచ్చినా జనసైనికులు వెంటనే స్పందించి సహకరిస్తారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన కార్యాలయంలో సిబ్బంది ప్రతిరోజూ అందుబాటులో ఉంటారని తెలిపారు.ఎవరికి సహాయం కావలసి వచ్చిన ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, కాళ్ల గోపికృష్ణ, మద్దాల మణికుమార్, దినేష్ యాదవ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కరెంటు లేక నీటి కష్టం మిగిలే



పులిచెర్ల, జర్నలిస్ట్ ఫైల్: చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి వేసిన కొత్త బోరు అధికారుల నిర్లక్ష్యంతో రెండు నెలలుగా పనిచేయకుండా నిలిచిపోయింది. గ్రామంలో బోరు తవ్వించి మోటారు కూడా అమర్చినప్పటికీ, విద్యుత్ సరఫరాకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో నీటి సరఫరా ప్రారంభం కాలేదు.ఒక శాఖ మోటారు అమర్చగా, మరో శాఖ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయక ఆలస్యం చేయడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై పంచాయతీ అభివృద్ధి అధికారి రమేష్‌బాబు ను వివరణ కోరగా ఏప్రిల్ 1న విద్యుత్ శాఖకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈఈ పురుషోత్తం మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో ఆలస్యం జరిగిందని, వారం రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి బోరును వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

## ప్రజల సహకారంతో అల్లూరి జిల్లాను ఆర్గానిక్ జిల్లాగా తీర్చిదిద్దాలి

**జిల్లా కలెక్టర్ నిషాంతి.టి**



పాడేరు,(జర్నలిస్ట్ ఫైల్): మే 16: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' (స్వా-స్వా) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ లక్ష్యంగా గ్రీన్ ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఆంధ్ర కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిషాంతి టి తెలిపారు. శనివారం పాడేరు మండలం కిండంగి గ్రామంలో తడి, పొడి చెత్తతో ఏర్పాటు చేసిన సంపద సృష్టి కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం వీఆర్ కళ్యాణ మండపంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ మిత్రులు, ఎఫ్‌పీఓలు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పరిశుభ్రమైన, హరిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అల్లూరి జిల్లాను ఆర్గానిక్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలిగించని, పునరుత్పాదక ఇంధన వినియోగం, వ్యర్థాల పునర్వినియోగం చేపట్టే గ్రీన్ ఎంటర్‌ప్రైజెస్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం, పారిశ్రామిక మరియు గృహ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని చెప్పారు. తడి, పొడి చెత్తతో పాటు కాఫీ వ్యర్థాల ద్వారా వర్మి కంపోస్ట్ తయారీ చేపట్టి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు.జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో వర్మి కంపోస్ట్ వినియోగాన్ని ప్రోత్సహించి, వాటి ద్వారా లభించే ఆదాయాన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ ప్రతి నెల మూడో వారంలో నిర్వహిస్తున్న 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం ద్వారా గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత 16 నెలలుగా 16 అంశాలపై ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజయవాడ సీపీఆర్ కమిషన్ సీఈవో వెంకటేశ్వరరావు, జీసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు, జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్పీవో, ఇతర జిల్లా అధికారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, క్లాప్ మిత్రులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## బాపట్ల పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రమైన వాతావరణంతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు.




బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్): :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా, బాపట్ల పట్టణంలోని 19వ వార్డు మార్కెట్ బజారులో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు స్వయంగా చేత్తో ఊడ్చి, చెత్తను తొలగించి స్థానికుల్లో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ:- బాపట్ల నియోజకవర్గాన్ని పచ్చదనం, పరిశుభ్రతలో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. మార్కెట్ బజారు వంటి వ్యాపార ప్రాంతాల్లో చెత్తాచెదారం రోడ్లపై వేయకుండా, మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని వ్యాపారస్తులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ రహిత బాపట్ల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు, నిరంతర పారిశుధ్య పనుల పర్యవేక్షణకు మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ కార్యక్రమమూ విజయవంతం కాదు. 'స్వచ్ఛ ఆంధ్ర' కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమం కాదు, అది మన ఇంటి బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, స్థానిక 19వ వార్డు నాయకులు, మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు, మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బాపట్లలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ ర్యాలీ



బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్): :ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలని వైద్యాధికారుల సూచనమురికివాడల్లో ముమ్మరంగా అవగాహన కల్పిస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థబాపట్ల పట్టణ కేంద్రంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఒక భారీ ర్యాలీని నిర్వహించారు. స్థానిక బాపట్ల మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, జెండా ఊపి ర్యాలీని అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం అత్యంత అవశ్యకమని పేర్కొన్నారు. దోమల వల్ల వ్యాపించే ఇటువంటి ప్రమాదకరమైన వ్యాధులను అరికట్టడానికి మున్సిపల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని, అయితే ప్రజల సహకారం లేనిదే పూర్తిస్థాయి నిర్మూలన సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి. వందన మాట్లాడుతూ, డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని అడ్డుకోవడానికి ఇళ్లలో మరియు బయట తీసుకోవలసిన పలు జాగ్రత్తలను శాస్త్రీయంగా వివరించారు. నిల్వ ఉన్న శుభ్రమైన నీటిలోనే డెంగ్యూ దోమలు (ఎడిస్ ఈజిప్టి) గుడ్లు పెడతాయని, కాబట్టి ఇళ్లలోని నీటి నిల్వలపై తప్పనిసరిగా మూతలు వేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి శుక్రవారం 'డ్రై డే' గా పాటించి, నీటి తొట్టెలను పూర్తిగా ఖాళీ చేసి, ఆరబెట్టిన తర్వాతే మరల నింపుకోవాలని అన్నారు. ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషనర్లు, ఫ్లవర్ వాజులు, అలాగే జంతువులు, పక్షుల కోసం ఉంచే తొట్టెల్లోని నీటిని కనీసం మూడు రోజులకు ఒకసారి మార్చాలని స్పష్టం చేశారు. కుళాయిల వద్ద నీరు నిల్వకుండా చూడాలని, ఓవర్ హెడ్ ట్యాంకులపై దోమలు జొరబడకుండా గట్టిగా మూతలు పెట్టాలని, దోమలు ఇంట్లోకి రాకుండా కిటికీలకు, తలుపులకు జాలీలు (మెష్‌లు) బిగించుకోవాలని కోరారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్య శాఖకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.అనంతరం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజలు కేవలం ప్రభుత్వాలపైనే ఆధారపడకుండా స్వయం అవగాహనతో మురుగు కాల్వల్లో చెత్తాచెదారం వేయడం మానాలని కోరారు. మురుగు నీరు సజావుగా సాగిపోయేలా చూసుకుంటే డెంగ్యూ వ్యాధిని సమూలంగా నివారించవచ్చని తెలిపారు. తమ సంస్థ తరఫున పట్టణంలోని పలు మురికివాడల్లో (స్లమ్ ఏరియాల్లో) ప్రజలకు నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.రెడ్‌క్రాస్ చైర్మన్ నారాయణ బట్టు మాట్లాడుతూ, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను రోడ్లపై లేదా ఖాళీ స్థలాల్లో వేయకుండా, మున్సిపల్ డస్ట్‌బిన్లలోనే వేసి దోమల నివారణ చర్యల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ భారీ అవగాహన ర్యాలీలో హెల్త్ సూపర్వైజర్లు జె. రాంబాబు, పి. సుధారాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షులు అల్లాడి రవికుమార్, ట్రెజరర్ సిహెచ్ కేశవులు, జాయింట్ సెక్రెటరీ ఎం. సూరిబాబులతో పాటు పెద్ద సంఖ్యలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా (ఙూనూ) కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొని డెంగ్యూ నివారణ స్లోగన్లు ఇస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు.

## శ్రీ కామాక్షి అమ్మవారికి ఇంద్రకీలాద్రి శ్రీ కనక దుర్గమ్మ వారు పట్టువస్త్రాల సమర్పణ



విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్): నెల్లూరులోని ప్రసిద్ధ శ్రీ కామాక్షి అమ్మవారికి విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం తరఫున శనివారం సాంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలను సమర్పించారు.దుర్గ గుడి ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, ఆలయ ముఖ్య అర్చకులు శ్రీనివాస శాస్త్రి, ట్రస్ట్ బోర్డు సభ్యులు, అర్చక బృందం కలిసి నెల్లూరు శ్రీ కామాక్షి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల తరఫున నెల్లూరు అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు-కుంకుమలు, ప్రసాదాలను వారు ఆలయ అధికారులకు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రి ఆలయ ప్రతినిధులకు ఘన స్వాగతం లభించింది. నెల్లూరు దేవస్థాన మర్యాదలతో ఆమె శ్రీ దుర్గమ్మ ఆలయ చైర్మన్, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, అర్చక బృందాన్ని గౌరవించారు.అనంతరం ఇంద్రకీలాద్రి అర్చక బృందం నెల్లూరు శ్రీ కామాక్షి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం చేశారు. రెండు ప్రసిద్ధ శక్తిపీఠాల ఆధ్యాత్మిక బంధాన్ని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది.

## ఈఓ నిరంతరం పర్యవేక్షణ అయిన భక్తులకు తప్పని తిప్పలు

**అమ్మ జగన్మాత కాపాడు అని వేడుకుంటున్న భక్తులు**



విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్): ఇంద్రకీలాద్రి పాత మెట్ల మార్గంలో శుక్రవారం ఉదయం 8:00 గంటల సమయంలో గుంటూరుకు చెందిన ఒక కుటుంబం శ్రీ కనకదుర్గమ్మ వారి దర్శనం కోసం పాత మెట్ల మార్గం గుండా కొండపైకి వస్తుండగా, సుమారు 50 సంవత్సరాల క్రితం నాటి పురాతన కట్టడం స్లాబ్ పెచ్చు ఊడి స్నేహ (9 సం॥) అనే బాలిక తలపై పడింది. దీనివల్ల బాలికకు గాయమైంది. వెంటనే స్పందించిన దేవస్థానం సిబ్బంది బాలికను ఆలయ ప్రథమ చికిత్స కేంద్రానికి తరలించి వైద్యం అందించారు. అనంతరం అంబులెన్స్ ద్వారా బాలికను ఆమె తల్లి పద్మావతితో కలిసి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. గవర్నమెంట్ హాస్పిటల్ వైద్యులు ఆ బాలికకు అవసరమైన చికిత్స అందించారు. ఈ ఘటనతో భయభ్రాంతులకు గురైన భక్తులు మీ దివ్య రూపాన్ని దర్శించుకునేందుకు వస్తున్న మమ్మల్ని నువ్వే కాపాడాలి తల్లి అంటూ జగన్మాతను వేడుకుంటున్నారు. వెంటనే ఆ మెట్ల మార్గంలో రాకపోకలను నిలిపివేసి, అత్యవసర మరామత్తు పనులు పూర్తి చేయడం జరిగింది. ఈ సంఘటనపై రాష్ట్ర దేవాదాయ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ డాక్టర్ ఎం. హరిజవహర్ లాల్ స్పందించారు. ఇది ఒక దురదృష్టకరమైన సంఘటన అని పేర్కొంటూ భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా భక్తుల భద్రత నిమిత్తం ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని, ఆలయ పరిధిలోని అన్ని సివిల్, ఎలక్ట్రికల్ విభాగాల పనులపై సర్టిఫైడ్ టెక్నికల్ సంస్థ ద్వారా సమగ్ర ఆడిట్ జరిపించాలని ఆలయ కార్యనిర్వహణాధికారిని ఆదేశించారు. ఈ సంఘటనపై ఈ.ఓ వివరణ ఇస్తూ ఆలయ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఎన్నో ఏళ్లుగా కేవలం ఒక ఆర్.ఎమ్.పి (=వీూ) మాత్రమే సేవలందిస్తూ వచ్చారని, అయితే, భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో (28.08.2025 న) ఏపీ పబ్లిక్ హెల్త్ ఙ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ కు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కు లేఖ రాసామని ఈ.ఓ తెలిపారు. ఆలయానికి ఇద్దరు అర్హత గల వీడీమీ వైద్యులను డిప్యుటేషన్‌పై కేటాయిస్తే, వారి వేతనాలను దేవస్థానమే చెల్లిస్తుందని ఆ లేఖలో కోరడం జరిగిందని తెలిపారు. జిల్లా ఙవీూ 4.09.2025న ఇద్దరు డాక్టర్లను కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.అయితే, వారిలో ఒక డాక్టర్ మాత్రమే విధుల్లో చేరి, ప్రతిరోజు ఉదయం 10 నుండి సాయంత్రం 6 గంటల వరకు సేవలందిస్తున్నారు. రెండో డాక్టర్ విధుల్లో చేరనందున, వారి స్థానంలో మరొకరిని కేటాయించాలని కోరుతూ ఉన్నతాధికారులకు, ఙవీూ కు దేవస్థానం తరఫున మరోమారు లేఖలు రాయడం జరిగిందని. డాక్టర్స్ కొరత తదితర కారణాలుతో రెండవ డాక్టర్ ను వారు కేటాయించలేదు.దేవస్థానం అవసరాల రీత్యా ఇంకొక డాక్టర్ ను కేటాయించమని ఇంకోసారి లేఖ వ్రాస్తున్నామని తెలియజేసారు. దశాబ్దాలుగా ఈ ఆలయంలో అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బంది లేకుండటంతో భక్తుల ఇబ్బంది గమనించి ఆలయ ఈ.ఓ భక్తుల ఆరోగ్య భద్రత కొరకు అర్హత గలిగిన ఒక +చీవీ, ముగ్గురు వీూఙఔ సిబ్బందిని ఏర్పాటు చేసి పూర్తి స్థాయి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవటం జరిగిందని, వీటికి తోడు, ఇటీవల దాతల సహకారంతో సమకూరిన 2 అధునాతన అంబులెన్స్‌లను నిరంతరం భక్తుల అత్యవసర సేవల కోసం అందుబాటులో ఉంచడం జరిగిందని, దేవస్థానంలో కేవలం ప్రథమ చికిత్సా కేంద్రం మాత్రమే ఉన్నందున భక్తులకు ఏదైనా ఆరోగ్య అసౌకర్యం కలిగితే నిముషాల్లో ప్రధాన ఆసుపత్రిలకు చేర్చేలా ఏర్పాటు చేయడమైదని తెలియజేసారు. గతంలో ఒక అంబులెన్సు మాత్రమే ఘాట్ రోడ్ వైపు ఉండేదని, ప్రస్తుతం 2 ప్రధాన మార్గాల్లో 2 అంబులెన్సులు ఏర్పాటు చేసామని,ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తుల భద్రత, ఆరోగ్యం, సౌకర్యాలకు దేవస్థానం ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, భక్తులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ.ఓ ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు.

## 55వ డివిజన్ ప్రజాదర్బార్లో ప్రజల నుంచి అర్జీలు తీసుకున్న నాగుల్ మీరా, ఎంఎస్ బేగ్



విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 55వ డివిజన్లో ఎంపీ కేశినేని చిన్ని ఆదేశాల మేరకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో నూర్ బాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, గ్రంథాలయ చైర్మన్ ఎం ఎస్ బేగ్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారుఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల దగ్గర నుండి నేరుగా సమస్యలు తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ లాంటి కార్యక్రమాలను విజయవాడ పార్లమెంట్ లో అమలు చేస్తున్న ఎంపీ కేశినేని చిన్నికి కృతజ్ఞతలు తెలియజేశారు. సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజానీకానికి ఎక్కడికి వెళ్లాలో తెలియక అధికారులు చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో ప్రజాదర్బార్ లాంటి కార్యక్రమం ప్రతి డివిజన్లో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో పాటు నాయకులు స్థానిక అధికారులు ఒకే చోట ఉండడంతో ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారం అవ్వడానికి దోహదపడతాయని అన్నారు.స్థానికంగా ఉన్న ప్రజలు పెన్షన్లు, గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలు రేషన్ కార్డులు, ఇలా అనేక సమస్యలతో రావడం జరిగిందని, త్వరలోనే ప్రభుత్వం పెన్షన్ల పైన తీసుకొచ్చే కొత్త పాలసీ పైన వారికి సమాచారం ఇచ్చి, అన్ని విధాల వారికి భరోసా ఇచ్చి, ఈ వివరాలన్నీ కూడా కొత్త పెన్షన్స్ లో, వచ్చే విధంగా చూస్తామని వారికి భరోసా కల్పించారు. జీవో నెంబర్ 30 ద్వారా విజయవాడ ప్రజానీకానికి గొప్ప శుభవార్త ఎంపీ చిన్ని తెలిపారని వారు ఇరువురు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కొట్టేటి హనుమంతరావు జిల్లా అధికార ప్రతినిధి రేగళ్ల లక్ష్మణరావు క్లస్టర్ ఇంచార్జ్ ధనేకుల సుబ్బారావు డివిజన్ అధ్యక్షుడు జహీద్ నాయకులు రేష్మ వద్దాది రవి, మల్లీశ్వరి పార్వతి ఎర్రంశెట్టి పద్మ, టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు చైతన్య మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మాధవ్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అన్సర్, తెలుగు మహిళా అధ్యక్షురాలు నసీమా, నాయకులు దుర్గ,శాంతి, బుజ్జి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె



**విజయవాడ,** (జర్నలిస్ట్ ఫైల్): **కొత్త ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సుహాన్ ట్రస్ట్ సద్గురు సాయి సేవ ఆధ్వర్యంలో పుట్టగుంట వెంకట వీరభద్రరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ తోటి వారి ఆకలిని తీర్చే అవకాశం రావడం అదృష్టంగా భావించాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వైద్య చికిత్సల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి బంధువులకు పుట్టగుంట వెంకట వీరభద్రరావు జ్ఞాపకార్థం వారి కుమార్లు పుట్టగుంట సురేష్, రమేష్ ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వారు గత ఏడాది నుండి ప్రతి గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో 500 మందికి అన్నదానాన్ని చేస్తున్నారని తెలిపారు. అన్ని దానాలలోకి అన్నదానం గొప్పదని, సురేష్, రమేష్ లు శ్లాఘనీయులని గద్దె పేర్కొన్నారు. వారి సేవా కార్యక్రమంలో తాను పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలకు అండగా ఉండాలని కోరారు. తమకు అవకాశం కల్పిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ నకు ఇతర అధికారులకు పుట్టగుంట సోదరులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టగుంట సోదరుల కుటుంబ సభ్యులు, జి.జి.హెచ్. సూరింటెండెంట్ ఎ.ఏడుకొండలు, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.**

## ఎన్నో అడ్డంకులు దాటుకుని వంగవీటి మోహన రంగా విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం

**ప్రజల నాయకుడు రంగా పేరు తరతరాలకు గుర్తుండాలి అని నిర్విరామంగా కృషిచేసిన ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్): అజిత్ సింగ్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చొరవతో కంట్రోల్ రూమ్ వద్ద ఏర్పాటు చేయనున్న స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహం, ఆ సర్కిల్‌కు "వంగవీటి మోహనరంగా సర్కిల్"గా నామకరణం చేయనున్న నేపథ్యంలో మా మిత్రమండలి ఉ రాధా రంగా మిత్రమండలి సభ్యులు, వివిధ కుల మతాలకు అతీతంగా విచ్చేసిన నాయకులు బొండా ఉమామహేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీల గుండె చప్పుడు అయిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని కంట్రోల్ రూమ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఎన్నో అడ్డంకులు వచ్చినప్పటికీ, రంగా ఆశయాలను నమ్మిన మిత్రబృందం, అభిమానులు, నాయకుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశామని పేర్కొన్నారు.రంగా పేద ప్రజల హక్కుల కోసం, బడుగు బలహీన వర్గాల న్యాయం కోసం నిరాహార దీక్షలు చేసి తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తు చేశారు. అలాంటి మహానేత విగ్రహం ప్రజల మధ్య, ఆయన పోరాటాలకు సాక్ష్యంగా నిలిచిన ప్రదేశంలో ఏర్పాటు కావడం చారిత్రాత్మకమని అన్నారు.అలాగే కంట్రోల్ రూమ్ జంక్షన్‌కు "వంగవీటి మోహనరంగా జంక్షన్"గా పేరు మార్చే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాబోయే తరాలకు రంగా సేవలు, త్యాగాలు చిరస్థాయిగా గుర్తుండేలా ఆయన పేరును శాశ్వతంగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. 35 సంవత్సరాలు గడిచినా వి.యం. రంగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన చరిత్రను ఎవ్వరూ మరచిపోలేరని అన్నారు. ఏ రాజకీయ పార్టీలో ఉన్నా, ఏ స్థాయిలో ఉన్నా, రంగా ఆశయ సాధన కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటామని తెలిపారు.ఇప్పటికే నియోజకవర్గంలో రంగా విగ్రహాలను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో కూడా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రజల కోసం జీవించిన నాయకుడిగా వంగవీటి మోహనరంగా పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని కొనియాడారు.ఈ సందర్భంగా రాధా రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ కంట్రోల్ రూమ్ జంక్షన్‌కు వంగవీటి మోహనరంగా పేరు పెట్టే తీర్మానాన్ని ఆమోదింపజేయడానికి ఎన్నో కష్టాలు ఎదురయ్యాయని పేర్కొన్నారు. స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల సహకారంతో తీర్మానం తీసుకువచ్చినా, దానిని వ్యతిరేకించేందుకు కొంతమంది ప్రయత్నించారని, అయినప్పటికీ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ చివరకు ఆ తీర్మానం ముందుకు వెళ్లేలా కృషి చేశామని. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బొండా ఉమామహేశ్వరరావు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు, జంక్షన్ నామకరణంతో పాటు, స్క్రాప్ పార్క్ ప్రాంతంలో రంగా విగ్రహ ఏర్పాటు కార్యక్రమాన్ని కూడా సమిష్టిగా ముందుకు తీసుకెళ్తున్నామని. ప్రజలు, అభిమానులు, మిత్రబృందం అందరూ ఎమ్మెల్యేకు అండగా నిలిస్తే ఈ కార్యక్రమం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, రంగా ఆశయాలను నిలబెట్టే దిశగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.అలాగే బొండా ఉమా ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే నాయకుడని, అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే శాసనసభ్యుడిగా గుర్తింపు పొందారని, అలాంటి నాయకుడికి మరింత గౌరవప్రదమైన స్థానం రావాలని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.చివరగా ఇప్పటివరకు అందించిన సహకారానికి అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా మద్దతు అందించాలని కోరారు. "జై వంగవీటి మోహనరంగా" సభా స్థలం మారుమోగింది.ఈ కార్యక్రమంలో మా మిత్ర మండలి నేతలు చింతల రామారావు (బాబీ ), చింతల రవికుమార్ (చంటి ),బొండా సిద్దార్థ, అడబాల కృష్ణజి, అడబాల బాల, నవనీతం సాంబశివరావు, గుర్రాల అమర్, దర్శి వాసు, రామకృష్ణ, పిల్ల శ్రీను, బుల్లా విజయ్ కుమార్, చందు జనార్ధన్, రాపాటి దుర్గారావు, అశోక్, రాయవరపు సాంబయ్య, రాజనాల బాబ్జి, అల్లు రమేష్, తోపాటు పెద్ద ఎత్తున వంగవీటి మోహన రంగా గారి అభిమానులు పాల్గొన్నారు.

## క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ డోర్ నంబరింగ్ వ్యవస్థపై సర్కిల్ 1,2,3 సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మున్సిపల్ పరిపాలన శాఖ రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న "క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ డోర్ నంబరింగ్ వ్యవస్థ" అమలుకు సంబంధించి విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సర్కిల్ 1,2,3 సిబ్బందికి, ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో గల మీటింగ్ హాల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు విడతలుగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని శనివారం డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ సృజన నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో వార్డు ప్లానింగ్ ఁ రెగ్యులేషన్ సెక్రటరీలు, వార్డు అమినిటీస్ సెక్రటరీలు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, సంబంధిత అధికారులకు శుక్రవారం నాడు శిక్షణ పొందిన ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. నగరంలోని ప్రతి ఆస్తికి సాంకేతిక ఆధారిత డిజిటల్ గుర్తింపును కల్పించడం ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన, సమర్థవంతమైన పౌర సేవలను అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని డీసీ ఆర్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో క్యూఆర్ కోడ్ ఆధారిత డోర్ నంబరింగ్ విధానం అమలు తీరు, యూఎల్బీ సరిహద్దుల నిర్ధారణ, రోడ్ల మ్యాపింగ్, ప్రతి ఆస్తి వివరాల సేకరణ, ప్రాపర్టీ పార్సెల్ మ్యాపింగ్, ఈఆర్పీ డేటా సమన్వయం, ఖచ్చితమైన భౌగోళిక గుర్తింపుల నమోదు తదితర అంశాలపై సవివరంగా అవగాహన కల్పించారు. అలాగే ప్రతి ఆస్తికి ప్రత్యేక క్యూఆర్ కోడ్ జెనరేషన్, డిజిటల్ డేటా సమగ్రత, భవిష్యత్ పట్టణ ప్రణాళికలో ఈ సమాచార వినియోగం వంటి అంశాలపై కూడా సర్కిల్ అధికారులకు మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు ఏ యు బి శర్మ ,హెలెన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, ప్లానింగ్, ఏమినిటీస్, అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## దూరదర్శిని పల్లెటూరి జ్ఞాపకాలతో సరికొత్త వినోదం



రాయచోటి (జర్నలిస్ట్ ఫైల్): వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన గ్రామీణ నేపథ్య కథలు తెలుగు ప్రేక్షకులకు ఎప్పుడూ ఇష్టమే. అదే కోవలో పక్కా పల్లెటూరి సామాజిక అంశాలతో, నవ్వులు పూయించే పాత్రలతో 'దూరదర్శిని ప్రేక్షకులను అలరిస్తుంది.మన ఊరి కథ.. మనందరి వ్యథ.. నవ్వుల జాతర – అదే 'దూరదర్శిని"వినోదానికి కొత్త కిటికీ.."అచ్చమైన పల్లెటూరి పరిమళం..ఈ 'దూరదర్శినిసినిమాను ఆదరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు'దూరదర్శిని చిత్ర బృందాన్ని ఘనంగా శాలువాతో సత్కరించి,సన్మానించిన లయన్స్ క్లబ్ రిజినల్ చైర్మన్ షేక్ మహమ్మద్‌నేటి యాంత్రిక జీవనంలో కాసేపు మన మూలాలను గుర్తు చేసుకుంటూ, హాయిగా నవ్వుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా ఇది. ముఖ్యంగా యువతకు తమ తల్లిదండ్రుల కాలం నాటి పరిస్థితులు ఎలా ఉండేవో తెలుసుకోవడానికి 'దూరదర్శిని' ఒక చక్కని మార్గం అని అన్నారు ఆ చిత్రం హిరో బొజ్జ సువిక్షత్ రెడ్డి,లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ షేక్ మహమ్మద్ ,దేసిరెడ్డి ప్రతాప్ రెడ్డి .అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రసాద్ హాల్ నందు ప్రేక్షకులతో కలిసి చిత్ర బృందం సందడి చేశారు.చిత్ర బృందానికి అయన అభిమానులు బాణాసంచాలు పేలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు.హిరో తో ఫోటోలు దిగేందుకు పిల్లలు పెద్దలు ఉత్సాహం చూపారు.ఈ సందర్బంగా మాట్లాడుతూ 90ల నాటి స్వచ్ఛమైన పల్లెటూరి ప్రేమకథ ను నేటి ఆధునిక కాలంలో కూడా అలనాటి జ్ఞాపకాలను, పల్లెటూరి స్వచ్ఛతను వెండితెరపై చూడాలని ప్రేక్షకులు కోరుకుంటారు. అటువంటి ఒక వింటేజ్ ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామానే 'దూరదర్శని'. రూపొందించమన్నారు.90వ దశకంలో గోదావరి జిల్లాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. 'మట్టపరు' అనే ఒక అందమైన గ్రామంలో కులమతాలకు అతీతంగా ఊరి జనం ఎలా కలిసిమెలిసి ఉండేవారో ఈ సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపించామన్నారు.కేవలం ప్రేమ మాత్రమే కాకుండా, చదువు ప్రాముఖ్యత మరియు తల్లిదండ్రుల అనురాగం ఎంత గొప్పదో తెలిపే సందేశం ఈ చిత్రంలో ఉందన్నారు.అప్పటి కాలం నాటి రేడియోలు, సైకిల్ ప్రయాణాలు మరియు మొదటిసారి గ్రామంలోకి




'దూరదర్శని' వచ్చినప్పుడు కలిగే ఉత్సాహం ప్రేక్షకులను మళ్ళీ పాత రోజుల్లోకి తీసుకెళ్తుందన్నారు. హీరో హీరోయిన్లతో పాటు కమెడియన్ భద్రం, లావణ్య రెడ్డి తమ నటనతో ప్రేక్షకులను ఎంతో అక్కట్టుకున్నయన్నారు. కార్తికేయ కొమ్మి పల్లెటూరి వాతావరణాన్ని, ఎమోషన్స్‌ను చాలా సహజంగా తెరకెక్కించారని, వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయ శంకర్ రెడ్డి.ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించి నట్లు గుర్తు చేశారు.గోదావరి జిల్లాల పచ్చదనం, నాటి ఇళ్ళు మరియు మనుషుల స్వచ్ఛత సినిమాకు ప్రధాన బలమని,"మీ చిన్ననాటి జ్ఞాపకాలను పలకరించే మధుర కావ్యం... మన 'దూరదర్శని!'" అని అన్నారు.భవిష్యత్తులో కుడా మంచి మంచి సినిమాలు తీయాలని వారు ఆకాక్షించారు.

## మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా శీలంశెట్టి వీరభద్రం ఏకగ్రీవ ఎన్నిక



ఖమ్మం,(జర్నలిస్ట్ ఫైల్): :మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా శీలంశెట్టి వీరభద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతోపాటు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి దేవేంద్రం, కోశాధికారిగా మదూరి పూర్ణచంద్రరావు, గౌరవ అధ్యక్షుడిగా కొత్త సీతారాములు ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం నగరంలోని గ్రాండ్ గాయత్రి హోటల్లో సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆకుల గాంధీ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి హాజరైన నాయకులంతా అధ్యక్షుని ఎంపిక నిర్ణయాన్ని సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నిర్ణయానికి వదిలేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆ మేరకు జిల్లాస్థాయిలో సంఘం నిర్మాణం, భవిష్యత్ అవసరాలు, సమస్యలపై చురుకుగా స్పందించే తత్వం కలిగిన శీలంశెట్టి వీరభద్రం పేరు ఆయన ప్రకటించగా సభ్యులంతా హర్షద్వానాలతో అంగీకారం తెలిపారు. అనంతరం మున్నూరు కాపు సంక్షేమ సంఘం అనుబంధ సంఘాలైన యువజన, మహిళా విభాగాలకు సైతం ఏకగ్రీవంగా కమిటీలను ఎన్నుకున్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షునిగా తోట రమేష్, ప్రధాన కార్యదర్శిగా మాటేటి కిరణ్ కుమార్, మహిళా విభాగం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పగడాల మంజుల, తోట సుజలా రాణి ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శాలువాలతో సత్కరించారు.కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రముఖులు మేకల బిక్షమయ్య,ఆర్జెసి కృష్ణ, కనకం జనార్ధన్, పొదిల రవికుమార్, శెట్టి రంగారావు, లక్కినేని రఘు, గీతా వెంకన్న, పొన్నం వెంకటేశ్వర్లు, బచ్చు విజయ్ కుమార్, జాబిశెట్టి శ్రీనివాసరావు, వివిధ నియోజకవర్గాల బాధ్యులు ఆళ్ల కృష్ణ, మారిశెట్టి వెంకటేశ్వరరావు, తోట గణేష్, మాజీ కార్పొరేటర్లు తోట రామారావు, మాటి నాగేశ్వరరావు, తోట వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత ఆంధ్ర ప్రదేశ్ ను నిర్మిద్దాం: ఎమ్మెల్యే గద్దె




విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్): ప్లాస్టిక్ రహిత ఆంధ్ర ప్రదేశ్ ను నిర్మిద్దాం అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఉదయం కోనేరు బసవయ్య చౌదరి హై స్కూల్ పటమట నందు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానేయాలని ముఖ్యంగా డిస్పోజబుల్ గ్లాసుల్లో, పేపర్ ప్లేటులో వేడివేడి ఆహారం తినటం వల్ల వాటిపై ఉన్న ప్లాస్టిక్ పూత కలిగి శరీరంలోకి ప్రవేశించి అవి క్యాన్సర్ కణాలు గా మారే అవకాశాలు ఉంటాయని, కావున సింగిల్ యూస్ ప్లాస్టిక్ కచ్చితంగా నిషేధించాలని అందరికీ పిలుపునిచ్చారు అంతేకాకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిండకుండా ఉండాలంటే ఇంట్లో ఉన్న ఆడవాళ్లు సానిటరీ నాకిండ్లు ప్లాస్టిక్ బాటిళ్లు వేయకూడదన్నారు. మొట్టమొదటిసారిగా పర్యావరణ పరిరక్షణకు తీసుకున్న మొదటి అడుగు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని, ఆంధ్రప్రదేశ్లో హరితాంధ్రప్రదేశ్ దిశగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఇప్పుడే కాకుండా గతంలో ముఖ్యమంత్రిగా చేసినప్పుడే మొదలుపెట్టారని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2025 26 లో కూడా విజయవాడ నగరానికి ఉత్తమమైన స్థానం నిలబెట్టుకునేందుకు ప్రజలందరూ సహకరించాలని ఒకవైపు అధికారులు ప్రజాప్రతినిధులు తమ వైపు నుంచి పూర్తి స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షన్ లో ఉత్తమమైన స్థానం నిలబెట్టుకునేందుకు విస్తృత కృషి చేస్తున్నప్పటికీ ప్రజలు కూడా వారికి సహకరించి బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేయకుండా సైడ్ కాలవల్లో ప్లాస్టిక్ బాటిళ్లు వేయకుండా సహకరించాలని విన్నవించారు.ఈ సందర్భంగా విజయవాడ దగ్గర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ నగరంలో ఇప్పటికే పూర్తిగా నిషేధించామని ప్రజలు కూడా వారి తరఫున సింగల్ యూస్ ప్లాస్టిక్ ని వాడకుండా కేవలం పర్యావరణహితమైన వస్తువులనే వాడాలని గుడ్డ సంచులను తమతో పాటు బయటకు వెళ్ళేటప్పుడు తీసుకువెళ్లాలని, ప్రజలు గుడ్డ సంచులను తమతో పాటు తీసుకువెళ్లటం ఒక అలవాటుగా మార్చుకోవాలని, స్వచ్ఛ సర్వేక్షన్ 2025- 26 లో విజయవాడ నగరానికి ఉత్తమమైన స్థానం రావాలంటే ప్రజలు వారి అభిప్రాయాలను తెలుపరాలని, ప్రతి ఒక్కరు విజయవాడకి ఓటు వేయాలని అన్నారు. ఏపీ పొల్యూషన్ బోర్డ్ వారి సౌజన్యంతో గుడ్డ సంచులను లాంచ్ చేయటమే కాకుండా అక్కడ వచ్చిన ప్రజలందరికీ గుడ్డ సంచులను పంచి కేవలం గుడ్డ సంచులను వాడమని వాళ్లందరికీ విన్నవించారు.స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ తీసుకుంటూ అక్కడికి వచ్చిన ప్రజలకు జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రజలు డెంగ్యూ బారిన పడకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన స్టాల్స్ ని సందర్శించారు. ప్రతి సంవత్సరం మే 16న జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా ప్రజల్లో డెంగ్యూ వ్యాధిపై అవగాహన పెంపొందించడం, దోమల నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతోందని, ఈ సందర్భంగా పట్టణ ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, యాంటీ లార్వల్ చర్యలు, ఫాగింగ్ కార్యక్రమాలు, నిల్వ నీటి తొలగింపు కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారని. వార్డు స్థాయిలో అధికారులు, సిబ్బంది ఇంటింటి తనిఖీలు నిర్వహించి దోమల పెరుగుదలకు కారణమయ్యే పరిస్థితులను గుర్తించి నివారణ చర్యలు చేపడుతున్నారని అన్నారు.

**ఈ సంవత్సరపు జాతీయ డెంగ్యూ దినోత్సవం థీమ్:**

"తనిఖీ చేయండి -- శుభ్రపరచండి -- మూతపెట్టండి" డెంగ్యూ వ్యాధి దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఈ దోమలు శుభ్రమైన నిల్వ నీటిలో పెరుగుతాయని, అందువల్ల ప్రజలు తమ ఇళ్ల పరిసరాలలో కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చెక్కలు, పాత టైర్లు, ఫ్రిజ్ ట్రేలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వారానికి ఒకసారి నీటి నిల్వ పాత్రలను తనిఖీ చేసి శుభ్రం చేయాలని, నీటి ట్యాంకులు, డ్రములు, బిందెలకు తప్పనిసరిగా మూతలు పెట్టాలని, పూర్తి చేతుల దుస్తులు ధరించాలని, దోమతెరలు, దోమ నివారణ క్రీములు ఉపయోగించాలని, జ్వరం, తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని,స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సూచనలు పాటించాలని, "డెంగ్యూ నివారణలో ప్రజల భాగస్వామ్యమే ప్రధాన ఆయుధం" అని నగరపాలక సంస్థ కమిషనర్ విజయవాడ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి డెంగ్యూ నిర్మూలనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ (ఇంచార్జ్)పి. సత్యకుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ నాయక్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజనీర్ శ్రీనివాస్, వన్ ఎర్త్ వన్ లైఫ్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మరింత పెరగనున్న పెట్రోల్ ధరలు



న్యూఢిల్లీ, (జర్నలిస్ట్ ఫైల్): దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్, డీజిల్ పై సగటున మూడు రూపాయలు పెంచుతూ శుక్రవారం ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. అయితే భవిష్యత్తులో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదని, దీంతో రాబోయే రోజుల్లో ఇంధన ధరల పెంపు మరింత ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేశారు. చమురు కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాల నుంచి బయటపడడానికి మూడు రూపాయలు పెంపు చాలదని లీటర్ పెట్రోల్, డీజిల్ ధర 10 రూపాయల వరకు పెరుగుతుందని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ పెంపు ఒకేసారి గానీ లేదా 2-3 వారాల్లో దశలవారీగా గానీ ఉండొచ్చన్నారు.

### - కేంద్రం చర్యలు

పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ, ఉద్రిక్తతలు నిరంతర సంక్షోభాల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు సరఫరాపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. దీంతో ధరల పెరుగుదలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకం వసూలును తాత్కాలికంగా నిలిపివేసింది. అలాగే ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు కూడా తమ లాభాలను వదులుకుని అధిక వ్యయాన్ని సొంతంగా భరించాయి. ఈ విపత్కర పరిస్థితుల కారణంగా ఇంధన ధరలను మూడు రూపాయలకు పెంచక తప్పలేదు. అయినప్పటికీ ఈ స్వల్ప పెరుగుదల కంపెనీల రోజువారీ నష్టాలను కొంతమేర తగ్గించిందే తప్ప, పూర్తిగా తొలగించలేక పోయింది. మరోవైపు దేశంలోని అతిపెద్ద పాల ఉత్పత్తుల రిటైలర్లు అయిన అమూల్, మదర్ డెయిరీ లీటరుకు రెండు రూపాయల చొప్పున పాల ధరలు పెంచడంతో వినియోగదారుల గృహ బడ్జెట్ పై భారం పడింది. దీనివల్ల ప్రాంతీయ డెయిరీ సంస్థలు కూడా ధరలను విపరీతంగా పెంచే అవకాశం ఉంది. ఇంధనం, వంటగ్యాస్, పాల ధరల పెరుగుదల వల్ల రాబోయే నెలల్లో రిటైల్ ద్రవ్యోల్బణం సైతం 0.42శాతం మేర పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరించారు.

## మున్నూరు కాపు సంఘం యువజన విభాగం అధ్యక్షునిగా తోట రమేష్ ఏకగ్రీవ ఎన్నిక



ఖమ్మం,(జర్నలిస్ట్ ఫైల్): మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా యువజన విభాగం అధ్యక్షునిగా తోట రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతోపాటు సంఘం యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాటేటి కిరణ్ కుమార్ లు ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం ఖమ్మం నగరంలోని గ్రాండ్ గాయత్రి హోటల్లో సంఘం జిల్లాలో గల వివిధ విభాగాల విస్తృత స్థాయి సమావేశం ఆకుల గాంధీ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి హాజరైన నాయకులంతా అధ్యక్షుని ఎంపిక నిర్ణయాన్ని సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నిర్ణయానికి వదిలేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆ మేరకు జిల్లాస్థాయిలో సంఘం నిర్మాణం, భవిష్యత్ అవసరాలు, సమస్యలపై చురుకుగా స్పందించే తత్వం కలిగిన తోట రమేష్ పేరు ఆయన ప్రకటించగా సభ్యులంతా హర్షద్వానాలతో అంగీకారం తెలిపారు. అనంతరం మున్నూరు కాపు సంక్షేమ సంఘం అనుబంధ సంఘాలను సైతం ఏకగ్రీవంగా కమిటీలను ఎన్నుకున్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుని గా తోట రమేష్ ఎన్నికైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంఘాన్ని మరింత బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధాన కార్యదర్శిగా మాటేటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ సంఘ ప్రతిష్టత కోసం ఐక్యంగా కలిసి పని చేసేందుకు తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శాలువాలతో సత్కరించారు.కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రముఖులు మేకల బిక్షమయ్య,ఆర్జెసి కృష్ణ, కనకం జనార్ధన్, పొదిల రవికుమార్, శెట్టి రంగారావు, లక్కినేని రఘు, గీతా వెంకన్న, పొన్నం వెంకటేశ్వర్లు, బచ్చు విజయ్ కుమార్, జాబిశెట్టి శ్రీనివాసరావు, వివిధ నియోజకవర్గాల బాధ్యులు ఆళ్ల కృష్ణ, మారిశెట్టి వెంకటేశ్వరరావు, తోట గణేష్, మాజీ కార్పొరేటర్లు తోట రామారావు, మాటి నాగేశ్వరరావు, తోట వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



## పెట్రోల్ ,డీజిల్ ధరలను పెంచడం ను నిరసించండి

: సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



ఖమ్మం,(జర్నలిస్ట్ ఫైల్): కేంద్ర ప్రభుత్వం పెట్రోల్,డీజిల్ ధరలను పెంచడాన్ని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పోటు రంగారావు తీవ్రంగా ఖండించారు. అయిదు రాష్ట్రాల ఎన్నికల ముందు వాటి ధరలు పెంచనని నరేంద్ర మోడీ స్వయంగా ఎన్నికల సభలలో చెప్పారు. ఎన్నికల ఫలితాల తడి ఆరకముందే పెట్రోల్,డీజిల్ ధరలను 3 రూపాయలు పెంచారు. గ్యాస్ పై బాదుడు బాదారు. దీని వలన బారమే కాకుండా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. అలానే రానున్న కాలంలో తీవ్ర సంక్షోభం రానున్నదని హెచ్చరికలు వస్తున్నాయి. నిరుద్యోగం పెరుగుతుంది. ఉపాధి మీద దెబ్బ తగులుతున్నది. సామాన్యులు, మధ్య తరగతి ఇప్పటికే రాబడి, పెరిగే ఖర్చుల మధ్య నలిగిపోతున్నారు. రానున్న కాలంలో మరింత గడ్డు కాలం ను ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మోడీ పైకి తియ్యటి మాటలు చెపుతూ కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా ప్రజల నడ్డి విరగ్గొట్టుతున్నాడు. ఇచ్చే మాటకు, చేసే చేతకు పొంతన లేదు. ధర్మం, దేశం కోసం అంటూ , మరోవైపు ప్రజల మధ్య విభజన తీసుక వస్తున్నాడు. మాట తప్పి పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధర పెంపు ను ఖండిస్తున్నాం. ప్రజలు , పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు జరపాలని కోరుతున్నాము. పెంచిన ధరలను ఉపసంహించుకోవాలని డిమాండ్ చేస్తున్నాము అని పోటు రంగారావు తెలిపారు.

## ప్రజలకు సత్వర సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని అధికారులకు మంత్రి సవిత ఆదేశాలు

పెనుకొండ : ప్రజలకు సత్వర సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతోనే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.శనివారం పెనుకొండ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి సవిత ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. పెనుకొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై భూ వివాదాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణ పథకాలు, విద్యుత్ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సేవలు, రహదారుల సమస్యలు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి ఒక్కరి సమస్యను ఓర్పుతో విన్న మంత్రి సవిత సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సామాన్య ప్రజలకు న్యాయం చేయడం, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా ప్రతినిధులే నిజమైన నాయకులని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పని చేస్తానని హామీ ఇచ్చారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలనలో పారదర్శకత పెరిగిందని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి వివరించారు. గ్రామ స్థాయిలోనూ సమస్యలు పేరుకుపోకుండా అధికారులు నిరంతరం ప్రజలతో మమేకం కావాలని సూచించారు.క్యాంపు కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరి వినతిని నమోదు చేసి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించిన మంత్రి, అర్హులెవరూ ప్రభుత్వ సహాయానికి దూరం కాకూడదన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు ఉద్యోగుల సమస్యలపై ఏపీఎన్‌జీవోస్ రాష్ట్ర సమావేశంలో విస్తృత చర్చ



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)** : స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటేరియట్ సమావేశంలో సమగ్ర చర్చ జరిగినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ మొహమ్మద్ జాని పాషా తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అధ్యక్షతన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ సమన్వయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 1.25 లక్షల మంది ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడి హోదాలో తొలిసారిగా రాష్ట్ర కమిటీ సమావేశంలో పాల్గొన్న జాని పాషా, గ్రామ--వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పని భారం, నిరంతర సర్వేలు, అదనపు విధులు, సమయపాలన ఒత్తిళ్లు, మానసిక వత్తిడి వంటి అంశాలను విపులంగా వివరించారు. ఉద్యోగుల సంక్షేమం, విధుల సరళీకరణ, మానవతా దృక్పథంతో విధుల కేటాయింపు అవసరాన్ని ప్రస్తావించారు.

నోషనల్ ఇంక్రిమెంట్లు, ఏఏఎస్ ఇంక్రిమెంట్, పదోన్నతులు, వివిధ శాఖల్లో విలీనం వంటి ప్రధాన డిమాండ్లతో పాటు ఉద్యోగులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడి అంశాన్ని కూడా సమావేశంలో ప్రస్తావించినట్లు తెలిపారు.

జాని పాషా ప్రస్తావించిన అంశాలపై రాష్ట్ర కమిటీ నాయకులు సవివరంగా చర్చించి, స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వాస్తవమేనని ఏకగ్రీవంగా అంగీకరించినట్లు వెల్లడించారు.

రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ నాయకత్వంలో, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణతో పాటు రాష్ట్ర కమిటీ మొత్తం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘం తరపున సమగ్ర చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆదివారం జరగనున్న రాష్ట్ర కార్యనిర్వాహక సమావేశంలో 26 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులతో కలిసి ఈ అంశాలపై మరింత విస్తృతంగా చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర కమిటీ నాయకులు స్పష్టం చేశారు.

## ప్రత్యేక శానిటేషన్ నిర్వహణ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** : చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెం లో ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాన్ని ఆదివారం ఎంపీడీవో టి ఊహారాణి ఆధ్వర్యంలో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి వి నాగసాయి కుమార్ , డిప్యూటీ ఎంపీడీవో ఎం రవిశంకర్ , స్వర్ణ గ్రామ అధికారి , చేబ్రోలు పంచాయతీ ఇంచార్జ్ పంచాయతీ అభివృద్ధి అధికారి కె శ్రీనివాసరావు స్వయంగా గ్రామంలో పర్యటించి పర్యవేక్షించారు . ఈ ప్రత్యేక సానిటేషన్ కార్యక్రమంలో గ్రామంలో ప్రైవేట్ , పబ్లిక్ స్థలాల్లో చెరువు కట్ట వద్ద పేరుకుపోయిన చెత్త, ముళ్ళ పొదలను పూర్తిగా తొలిగించి పరిశుభ్రపరచడం జరిగింది అని ఎం పి డి ఓ తెలిపారు. శుక్రవారం కొత్త రెడ్డిపాలెం లో ఫుడ్ పాయిజనింగ్ వలన 59 మంది పిల్లలు , మహిళలు , వృద్ధులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసినదే . ఈ నేపథ్యంలో వెంటనే అప్రమత్తమైన ప్రభుత్వ అధికారులు ఆ ఏరియాలో డయేరియా ప్రభలకుండా పటిష్టంగా చర్యలు చేపట్టి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు . అలానే గ్రామంలోని వీధులు , బహిరంగ ప్రదేశాలలో ఉన్న చెత్తకుప్పలను తొలగించారు . మురుగు కాలువల్లో నీటి నిల్వ ఉండకుండా పేరుకుపోయిన బురద , అడ్డంకులు శుభ్రపరిచారు . శుక్ర మరియు శనివారాల్లో గ్రామపంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బంది చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ వలన తొలి రోజు మెడికల్ క్యాంపులో 59 మంది అస్వస్థత గురై నమోదు కాగా వారి అనారోగ్య పరిస్థితిని బట్టి 15 మందికి ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వడం జరిగింది . మిగిలిన 44 మందికి ఓరల్ ట్రీట్మెంట్ ఇవ్వడం జరిగింది. వీరిలో తొలిరోజే వీరిలో 24 మంది పూర్తిగా కోలుకున్నారని తెలిపారు. రెండో రోజు కొనసాగిన క్యాంపులో 35 మంది ఓ పి వచ్చారు . వీరిలో లో 15 మందికి ఐ వి ఫ్లూయిడ్స్ పిచ్చి చికిత్స అందించడం జరిగింది .

# ఏపీలో కూటమి పాలనకు రెండేళ్లు పూర్తి

- **జూన్ 12న 1.53 లక్షల మంది వితంతువులకు పింఛన్లు**
- **కూటమి పాలన రెండేళ్లు పూర్తి**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : కొత్త పింఛన్లకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత వితంతు పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించిన ఏపీ ప్రభుత్వం.. ఇందుకు ముహూర్తం ఫిక్స్ చేసింది.

ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జూన్ 12న వితంతు పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు ఆదివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడిన అచ్చెన్నాయుడు.. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి కానున్న నేపథ్యంలో జూన్ 12 నుంచి కొత్త వితంతు పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు త్వరలోనే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా వితంతువుల పింఛన్ల కింద 1.53 లక్షల మంది వరకూ అర్హులుంటారని సెర్ప్ అంచనా వేస్తోంది. నెలకు రూ.4వేల చొప్పున లక్షా 53 వేల మందికి వితంతు పింఛన్లు అందించేందుకు సుమారుగా రూ.61 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక స్పౌజ్ పింఛన్లు అందిస్తున్న సంగతి తెలిసిందే. స్పౌజ్ కేటగిరి కింద పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే.. అతని పింఛను మరుసటి నెలలోనే అతని భార్య పేరు మీదకు మార్చుతున్నారు. ఈ కేటగిరీ కింద ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా 2.30 లక్షల మందికి కొత్త పింఛన్లు అందించారు. అయితే పింఛను అందని భర్త చనిపోతే పరిస్థితి వేరుగా ఉంది. చనిపోయిన వ్యక్తి భార్యకు వితంతు పింఛన్ అందించటంలో జాప్యం జరుగుతోంది.

ఈ నేపథ్యంలోనే జూన్ 12న అర్హులైన వితంతువులకు పింఛన్లు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. వితంతువుల తర్వాత అర్హులైన దివ్యాంగులకు కొత్త పింఛన్లు అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. కొత్త దివ్యాంగ పింఛన్ల కోసం ఇప్పటికే చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హులైన వారికి పింఛన్ అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# ఆరోగ్యవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- **ఎమ్మెల్యే గళ్ళా మాధవి**
- **18వ డివిజన్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**
- **వికాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు - 400 మందికి పైగా పరీక్షలు**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని ఆరోగ్యవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న సత్సంకల్పంతో ప్రతి వారం ఒక్కో డివిజన్ లో మెగా మెడికల్ క్యాంప్ కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ 18వ డివిజన్ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో, శ్రీ భ్రమర ట్రస్ట్ సహకారంతో వికాస్ హాస్పిటల్స్ నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి, శ్రీ భ్రమర టౌన్ షిప్స్ అధినేత గళ్ళా రామచంద్రరావు సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ మెగా వైద్య శిబిరంలో వందలాది మంది ప్రజలు పాల్గొని ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ, వాస్కులర్ సర్జరీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు ప్రజలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఈ సంవత్సరం తాము “ఉద్యోగ కల్పన – ఆరోగ్యం” అనే రెండు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతున్నామని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి డివిజన్‌లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

ఇప్పటికే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో దాదాపు 70 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని, వికాస్ హాస్పిటల్స్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోందన్నారు. ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, ల్యాబ్ టెస్టులు, మందులు అందించడం ద్వారా ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

**400 మందికి పైగా పరీక్షలు - గుండె సమస్యలు గుర్తింపు** : ఈరోజు నిర్వహించిన శిబిరంలో ఇప్పటికే 400 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈసీజీ పరీక్షల్లో కొందరికి గుండె సంబంధిత సమస్యలు గుర్తించబడటంతో వారిని వెంటనే హాస్పిటల్‌కు వచ్చి చికిత్స పొందాలని వైద్యులు సూచించినట్లు చెప్పారు. డయాబెటిస్, బీపీ, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారికి అక్కడికక్కడే ఉచిత మందులు అందించామని, వాస్కులర్ సమస్యలతో బాధపడుతున్న కొందరిని మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలని సూచించినట్లు వివరించారు. ప్రజలు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ల్యాబ్ టెస్టులను కూడా శిబిరాల్లోనే ఉచితంగా నిర్వహించడం సంతోషకరమన్నారు.

**ఒంటరి మహిళలకు భరోసా** : శిబిరానికి వచ్చిన కొంతమంది ఒంటరి మహిళలు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. వారికి ఎన్టీఆర్ వైద్య సేవలు, అవసరమైతే గాజ, జవీ=ఖీ ద్వారా సహాయం అందించి తక్షణ చికిత్స కల్పించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

వికాస్ హాస్పిటల్స్ యాజమాన్యంతో కూడా మాట్లాడినట్లు, అవసరమైన వారికి సహకారం అందిస్తామని వారు ముందుకు వచ్చారని వెల్లడించారు.

**వికాస్ హాస్పిటల్స్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు** : ప్రజలకు సేవలందిస్తున్న వికాస్ హాస్పిటల్స్ డాక్టర్లు, సిబ్బంది, యాజమాన్యానికి, ఈ కార్యక్రమం విజయవంతం చేయటానికి సహకరించిన డివిజన్ టీడీపీ అధ్యక్షులు ఉల్లి గోపాల్ కృష్ణ,జనసేన సానం రమేష్,నిమ్మల రమణ, ఉప్పదల సాంబ మరియు బీజేపీ నారాయణ, నేతలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు 19న

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : ఆల్ ఆంధ్ర ప్రదేశ్ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం గుంటూరు జిల్లా ఎన్నికలు ఈ నెల 19న గుంటూరులోని ఎన్జీవో హోంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బి.కృష్ణ కిషోర్ తెలిపారు.

ఎన్నికల నిర్వహణ కోసం ఏపీ ఎన్జీవో గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల కమిటీని నియమించినట్లు వెల్లడించారు. బి.కృష్ణ కిషోర్‌ను ఎన్నికల అధికారిగా, జీవి కోటేశ్వరరావును సహాయ ఎన్నికల అధికారిగా, యల్.శ్రీధర్ రెడ్డిని ఎన్నికల పరిశీలకునిగా నియమించినట్లు పేర్కొన్నారు.

ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని తెలిపారు. అనంతరం ఈ నెల 26న ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సంఘంలో అధ్యక్షుడు, సహ అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులు, కార్యదర్శి, కార్యనిర్వాహక కార్యదర్శి, ఇద్దరు సంయుక్త కార్యదర్శులు, కోశాధికారి పదవులకు కలిపి మొత్తం 9 పోస్టులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



- **గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**
- **200 మందికి ఉచితంగా పరీక్షలు**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం పాత గుంటూరు యాదవ స్కూల్ లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఉదయ్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆప్తమాలజీతోపాటు ఇతర అన్ని విభాగాలకు సంబంధించిన వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలతోపాటు మందులు అందించడం మంచి విషయమన్నారు. కంటిలో శుక్లాలు, ఇతర సమస్యల పరిష్కారానికి ఉచితంగా వైద్య చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో పేద వర్గాల ఆరోగ్యానికి భరోసా కల్పించే విధంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. కేవలం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోనే 18 నెలల కాలంలో 11 కోట్ల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ అందించామని చెప్పారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలోని అన్ని విభాగాల్లో మౌలిక వసతులతోపాటు వైద్య పరికరాలను సమకూరుస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిరుపయోగంగా ఉన్న వైద్య పరికరాలను గుంటూరు ప్రభుత్వాస్పత్రి తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు విన్నవించానని తెలిపారు. దీంతో వివిధ వైద్య పరికరాలను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి వచ్చాయని చెప్పారు. నాట్కోలో క్యాన్సర్ పరీక్షలకుగాను పెట్ స్కానింగ్ మిషన్ ప్రారంభించామని, రూ.25 వేలు విలువైన స్కానింగ్ ఉచితంగా చేయనున్నామని తెలిపారు. శిబిరంలో సుమారు 200 మందికి వైద్య సేవలు అందించారు.

## గుంటూరు ఈస్ట్ ఎంఈఓ కార్యాలయాన్ని ఆ ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలి



- **నోబుల్ టీచర్స్ అసోసియేషన్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : గుంటూరు ఈస్ట్ ఎంఈఓ కార్యాలయాన్ని గుంటూరు ఈస్ట్ ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ నాయకులు శనివారం స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ బి.లింగేశ్వర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

ప్రస్తుతం గుంటూరు ఈస్ట్, గుంటూరు వెస్ట్ ఎంఈఓ కార్యాలయాలు రెండూ కలెక్టరేట్ బంగ్లా రోడ్డులోని ఒకే కార్యాలయంలో కొనసాగుతున్నాయని, దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా గుంటూరు ఈస్ట్ ప్రాంతానికి కార్యాలయం దూరంగా ఉండటం వల్ల పరిపాలనపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.

రెండు మండలాల ఉపాధ్యాయుల సేవా సంబంధిత వ్యవహారాలు ఒకే కార్యాలయం ద్వారా నిర్వహించడం వల్ల సర్వీస్ రిజిస్టర్లు సకాలంలో అప్డేట్ చేయలేకపోతున్నారని వివరించారు. ఉపాధ్యాయుల సంఖ్య అధికంగా ఉండటంతో కార్యనిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందువల్ల గుంటూరు ఈస్ట్ ఎంఈఓ కార్యాలయాన్ని ప్రత్యేకంగా ఆ ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ అంశంపై ఆర్జేడీ బి.లింగేశ్వర్ రెడ్డి సానుకూలంగా స్పందించి, దీనికి సంబంధించిన ప్రక్రియను వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు, జిల్లా అధ్యక్షుడు పి.సాయి విశ్వనాథ్, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ పి.లలిత బాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎన్.వేణుగోపాలరావు, రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ నాయకుడు బ్రహ్మం, నగర అధ్యక్షుడు కె.వి.రాఘవులు, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు టి.రవి తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్పీ కార్యాలయంలో పాస్ పోర్టు అప్పగించిన విడుదల రజని

**నరసరావుపేట(జర్నలిస్ట్ ఫైల్)** : హైకోర్టు ఆదేశాలతో మాజీ మంత్రి, వైసిపి నేత విడదల రజని తన పాస్‌పోర్ట్‌ను పల్నాడు జిల్లా నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో అప్పగించారు. టిడిపి నేత పిల్లి కోటి ఫిర్యాదుతో విడదల రజనీతోపాటు మరికొందరిపై చిలకలూరిపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో ఆమె పాస్‌పోర్ట్ అప్పగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో ఆదివారం డీఎస్పీ హనుమంతరావుకి తన పాస్‌పోర్ట్‌ను సరెండర్ చేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# సి.ఐ.టి.డి., లఘు ఉద్యోగ భారతి ఆధ్వర్యంలో వెండార్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహణ




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్, హైదరాబాద్, లఘు ఉద్యోగ్ భారతి, ఆంధ్రప్రదేశ్ సహకారంతో గుంటూరు ఏ.పి. కాటన్ అసోసియేషన్ హాల్ లో రెండు రోజుల వెండార్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లో భాగంగా ఆదివారం రెండవ రోజు కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తమ విలువైన సలహాలను అందించారు. కార్యక్రమానికి గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరు కాగా ఏపీ ఎం ఎస్ ఎం ఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, తులసీ గ్రూప్ అధినేత తులసి రామచంద్ర ప్రభు, ఎం ఎస్ ఎం ఈ విశాఖపట్నం నుండి అసిస్టెంట్ డైరెక్టర్ డి.వీరయ్య అతిథులుగా లఘు ఉద్యోగ భారతి ఆల్ ఇండియా వర్కింగ్ కమిటీ సభ్యులు అన్నే కృష్ణ బాలాజీ విశిష్ట అతిథిగా హాజరయ్యారు.

కార్యక్రమములోముఖ్య అతిథి నసీర్ అహ్మద్ మాట్లాడుతూ లఘు ఉద్యోగ భారతి సేవలు దేశంలో నలుమూలలకు విస్తరించాలని, నిరుద్యోగ యువత దృష్టి స్వయం ఉపాధి పథకాల వైపు మళ్లించేలా చూడాలని కోరారు. పరిశ్రమల స్థాపనలో ప్రభుత్వ పరంగా యువతకు తన శక్తిమేరకు తోడ్పాటును అందించగలనని అన్నారు. ఏపీ ఎం ఎస్ ఎం ఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి పారిశ్రామిక రంగ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించి అనేక సంస్కరణలు చేపట్టిందన్నారు. కొల్లేట్రల్ సెక్యూరిటీ తో పనిలేకుండా బ్యాంకర్లు పారిశ్రామిక వేత్తలకు ఆర్థిక రుణాలు మంజూరు చేసి సహకరించాలని కోరారు. ముఖ్యంగా గుంటూరు లో పండించే ఆగ్రో ఉత్పత్తులైన మిర్చి, పొగాకు, పసుపు వంటి వ్యవసాయ ఆధారిత వాణిజ్య పంటలకు ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు ఉందన్నారు. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా కూటమి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుండి ఓ పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నప్రధాని మోడీ లక్ష్యంతో కూటమి సర్కార్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

అనంతరం యూనియన్ బ్యాంకు, గుంటూరు చీఫ్ మేనేజర్ వి.శ్రీనివాసరావు, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా, గుంటూరు ఏ.జీ.ఎం. శశిధర్ మాట్లాడుతూ కొత్తగా వ్యాపారం ప్రారంభించే వారికి బ్యాంకులు అందించే వివిధ రకాలైన ఋణ సౌకర్యాలను గురించి, వ్యాపారస్తులు ఋణం పొందాలంటే బ్యాంకులకు అందజేయవలసిన వివరాలు,అలాగే ఋణం ఇచ్చే ముందు బ్యాంకులు పరిశీలించే అంశాలు సవివరంగా తెలిపారు. అనంతరం చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు విజయవాడ బ్రాంచి ఏ.జీ.ఎం. ఎస్. సుకుమార్ మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కోసమే ఏర్పడిందని. ఈ బ్యాంకు చిన్న పరిశ్రమలకు ఆర్థిక సహాయం అందించే బ్యాంకులు మరియు ఇతర సంస్థలకు నిధులను సమకూర్చి మద్దతునిస్తుంది తెలిపారు. చిన్న పరిశ్రమలకు వర్కింగ్ క్యాపిటల్, దీర్ఘకాలిక రుణాలు, సాంకేతికతను అప్‌గ్రేడ్ చేయడానికి వివిధ పథకాల ద్వారా మద్దతు నిస్తుందని వివరించారు. ప్రధాని మోడీ మేక్ ఇన్ ఇండియా పిలుపు మేరకు ప్రస్తుతం రక్షణ రంగానికి కూడా తమ సేవలను అందిస్తున్నామని ఆయన తెలిపారు.

స్టేట్ జి ఎస్ టిఅసిస్టెంట్ కమీషనర్ పి.వి.ఎస్.రంగయ్య మాట్లాడుతూ కొత్తగా పరిశ్రమలు స్థాపించేవారు ఎప్పుడు జి ఎస్ టి నమోదు చేసుకోవాలో, రిటర్న్ ఎప్పుడు ఆన్ లైన్లో సమర్పించాలో తెలిపి ఏయే రంగాలకు జి ఎస్ టి మినహాయింపులు ఉన్నాయో వివరించారు. ఐ.టి.సి., ఏ.బి.డి. గుంటూరు తరపున సాయిరాం రెడ్డి మాట్లాడుతూ వినియోగదారు వ్యవస్థలో ‘ప్యాకింగ్’ కు వున్న ప్రాముఖ్యతను వివరిస్తూ ఏయే వస్తువులకు ఎన్ని ప్యాకింగ్ విధానాలు, వాటికి ప్రత్యామ్నాయాలు ఉన్నాయో వివరిస్తూ, ఎగుమతి రంగంలో ఎటువంటి ప్యాకింగ్ అనుసరిస్తే అభ్యంతరాలు ఉండవో తెలుసుకుని ఉత్పత్తిదారు మెలగాలని సూచించారు. చిల్లీస్ ఎక్సపోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి తోట రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూచించిన ‘ఒన్ డిస్ట్రిక్ట్ ఒన్ ప్రోడక్ట్’ నిర్ణయం మేరకు గుంటూరు జిల్లాకు మిర్చి పంటను ఏర్పాటు చేయటం జరిగిందని, మిరప సాగులో విత్తన శుద్ధి నుండి పంట చేతికి వచ్చే వరకు వుండే దశలు, మిరప రకాలు, వాటి విలువ ఆధారిత ఉత్పతులు, ఎగుమతులు, అనుమతుల విషయంలో తీసుకోవలసిన మెళకువలను గురించి వివరించారు. కేంద్ర ఆహార సాంకేతిక పరిశోధనా సంస్థ మైసూర్ ప్రతినిధి బి.కే.బెట్టదయ్య మాట్లాడుతూ మిర్చికి సంభందించిన వివిధ విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి ప్రెసెంటేషన్ ప్రెసెంటేషన్ ఇచ్చారు. వి.వి.ఐ.టి. విశ్వ విద్యాలయం అకాడెమిక్ డీన్ డాక్టర్ గిరిబాబు మాట్లాడుతూ ‘ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్’ మాధ్యమాన్ని ప్రత్తి పంట సాగులో ఎలా ఉపయోగించవచ్చో ప్రెసెంటేషన్ ఇచ్చారు.

కార్యక్రమానికి లఘు ఉద్యోగ భారతి తరుపున రాష్ట్ర విభాగం అధ్యక్షులు తులసి యోగిష్ చంద్ర, గుంటూరు జిల్లా అధ్యక్షులు మూల్పూరు రాజేంద్ర, జిల్లా కార్యదర్శి కనదం నరేంద్ర, దుర్గా భవాని తమ సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి పలు ప్రాంతాల నుండి కళాశాలల విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, రైతులు హాజరుఅయ్యారు.

## ప్రశాంతంగా ముగిసిన తాలీం - ఏ - హునర్ టాలెంట్ టెస్ట్



- పరీక్షకు 6605 మంది విద్యార్థులు హాజరు
- పరీక్ష నిర్వహణ లో పాల్గొన్న 450 మంది సిబ్బంది
- అన్నీ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు
- పేదవారు సైతం దేశ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించే స్థాయికి చేరుకోవాలి
- ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన "తాలీం-ఏ-హునర్" టాలెంట్ టెస్ట్ రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 27 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణలో 450 మంది సిబ్బంది పాల్గొని సమన్వయం చేశారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 7392 విద్యార్థుల్లో 6605 మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించగా, 787 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ కట్టుదిట్టమైన భద్రత మరియు ప్రత్యేక పర్యవేక్షణ మధ్య పరీక్షలు నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు.

**జిల్లా కలెక్టర్ల సమన్వయంతో ఏర్పాట్లు :** ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహణ కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో పనిచేశారు. పలు జిల్లాల్లో జిల్లా కలెక్టర్ లు, డీఆర్వో లు, వక్ఫ్ బోర్డు సీఈఓ యాకుబ్ భాష స్వయంగా కేంద్రాలను సందర్శించారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారుల పర్యవేక్షణలో, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీల ఆధ్వర్యంలో పరీక్షలు సజావుగా నిర్వహించబడ్డాయి. ప్రతి పరీక్ష కేంద్రంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతే కాక విద్యార్థుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఫస్ట్ ఎయిడ్ సేవల కోసం ఏఎన్ఎం నర్సులను ప్రత్యేకంగా నియమించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

**విజయవాడకు చేరనున్న జవాబు పత్రాలు:** రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని పరీక్షా కేంద్రాల నుంచి జవాబు పత్రాలు కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య విజయవాడ కలెక్టర్ కార్యాలయానికి తరలించబడుతున్నాయి. అనంతరం విజయవాడ కలెక్టరేట్‌లో ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో జవాబు పత్రాల మూల్యాంకనం (కరెక్షన్) ప్రక్రియ చేపట్టనున్నారు.

**విజయవంతానికి కృషి చేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు:** కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా యంత్రాంగం, అధికారులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా దేశ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించే స్థాయికి చేరుకోవాలన్నదే తమ లక్ష్యం అని అబ్దుల్ అజీజ్ తెలిపారు. ముస్లిం విద్యార్థుల భవిష్యత్తు మార్పుకు "తాలీం-ఏ-హునర్" కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ప్రధాని పిలుపుతో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ పొదుపు చర్యలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాని మోడీఇచ్చిన పిలుపు మేరకు కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అధికారిక కాన్వాయ్‌ను వదిలి ఢిల్లీ మెట్రోలో ప్రయాణించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనం ఆదా చేసే ప్రతి లీటర్ పెట్రోల్, డీజిల్.. భారతదేశానికి ఆదా చేసిన విదేశీ మారక ద్రవ్యమని తెలిపారు. మెట్రోలో ప్రయాణించే ప్రతి కిలోమీటర్ మన ఆర్థిక వ్యవస్థకు బలం, మన పర్యావరణానికి రక్షణ అని పేర్కొన్నారు. ఈ జాతీయ సంకల్పంలో భాగస్వాములు కావాలని ప్రతి భారతీయుడికి పిలుపునిచ్చారు. 'మెట్రో ఎక్కండి. బస్సు ఉపయోగించండి. పొరుగువారితో కార్‌పూల్ చేయండి. వీలైనప్పుడు ఇంటి నుంచే పని చేయండి. 140 కోట్ల భారతీయుల చిన్న అడుగులే మోడీజీ కలలుగన్న ఆత్మనిర్భర భారత్‌కు పెద్ద పునాది అవుతుంది." అని భూపతి రాజు శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు.

## గద్దె తిలక్ సేవలు చిరస్మరణీయం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సర్వీస్ ట్యాక్స్, జి.ఎస్.టి శాఖల ఉద్యోగి గా గద్దె వెంకట బాల గంగాధర తిలక్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఆ శాఖల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. వివేకానంద అన్నారు. గుంటూరు కన్నవారితోటలోని జిఎస్టి భవన్ లో దివంగత సెంట్రల్ జి.ఎస్.టి సూపరింటెండెంట్ గద్దె తిలక్ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ..శాఖ అభివృద్ధితో పాటు, ఉద్యోగుల అభ్యున్నతి కి తోడ్పడిన ఆదర్శ వ్యక్తి తిలక్ అని ప్రశంసించారు. తిలక్ ఉద్యోగ ప్రస్థానం స్ఫూర్తి దాయకమన్నారు. ఉద్యోగ సంఘ నేతలు ఎం.నాగరాజు, బి. రాజేశ్వరరావులు మాట్లాడుతూ..ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తిలక్ చేసిన సేవలు సాటిలేనివన్నారు. తిలక్ మరణంతో సెంట్రల్ ఎక్సైజ్, జిఎస్టి శాఖ అత్యుత్తమ ఉద్యోగి ని కొల్పోయిందన్నారు. విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్లు మధుబాబు, రాజారావు లు మాట్లాడుతూ...ఉద్యోగుల సంక్షేమమే పరమావధి గా తిలక్ పనిచేసారన్నారు. ప్రతిభ, పట్టుదలే తిలక్ అభివృద్ధికి సోపాలన్నారు. సభలో తిలక్ సేవలను పలువురు ప్రస్తుతించారు. తొలుత తిలక్ చిత్ర పటానికి పులమాల వేసి, నివాళులర్పించారు. మరణానికి సంతాపంగా సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించింది. కార్యక్రమంలో పి.వి.సత్యనారాయణ, నగేష్ బాబు, పి.కోటేశ్వరరావు, గుమ్మడి సీతారామయ్య చౌదరి, సామ్రాజ్యం, మిక్కిలినేని శ్రీనివాస్, కె.ఎస్.శాస్త్రి, సుమంత్, ఈశ్వరమ్మ, భానుమతి, నాగశంకర్, ఎస్. ఎస్.శాస్త్రి, సుభాన్, డ్రైవర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలి



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరియు నిడదవోలు నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో మరింత దూసుకుపోవాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని పలు అధికారిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో మంత్రి దుర్గేష్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరు గ్రామ దేవత అయిన శ్రీ తాళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పలువురికి స్వయంగా అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, నిడదవోలు నియోజకవర్గం ప్రగతి పథంలో ముందడుగు వేయాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. జాతర మహోత్సవాలకు విచ్చేసిన భక్తులకు, గ్రామస్తులకు మంత్రి దుర్గేష్ శుభాకాంక్షలు తెలియజేశారు.

**రాజమహేంద్రవరంలో 'త్రిసంధ్య హాస్పిటల్' ఘన ప్రారంభం:** అంతకుముందు రాజమహేంద్రవరంలో నూతనంగా నిర్మించిన "త్రిసంధ్య హాస్పిటల్" ప్రారంభోత్సవ వేడుకకు మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు తో కలిసి మంత్రి దుర్గేష్ రిబ్బన్ కట్ చేసి హాస్పిటల్‌ను అత్యంత ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అత్యాధునిక వైద్య సదుపాయాలను వారు పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెచ్చి, ప్రజలకు మెరుగైన, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. ప్రజల ఆరోగ్య రక్షణలో ప్రైవేట్ ఆసుపత్రుల పాత్ర కూడా కీలకమని పేర్కొంటూ, త్రిసంధ్య హాస్పిటల్ యాజమాన్యానికి మరియు వైద్య బృందానికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

**కూటమి శ్రేణుల పరామర్శ :** వైద్య, ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం మంత్రి కందుల దుర్గేష్ కానూరు గ్రామంలో పర్యటించారు. ఇటీవల కాలంలో అనారోగ్యం బారిన పడిన పలువురు కూటమి నాయకులను, కార్యకర్తలను మరియు వారి కుటుంబ సభ్యులను మంత్రి స్వయంగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తామని భరోసానిచ్చారు.

## వైసీపీ పాలనలో రైతాంగం పూర్తిగా సంక్షోభంలోకి వెళ్లింది

- ఇప్పుడు కపట ప్రేమ చూపించడం దారుణం
- వైసీపీ నేతల వ్యాఖ్యలపై మంత్రి అచ్చెన్నాయుడు ఘాటు స్పందన



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో రైతుల సమస్యలు పడుతున్నారు అంటూ వైసిపి నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. గత ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి రైతాంగాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ నేతలు, ఇప్పుడు రైతుల పట్ల సానుభూతి మాటలు మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిందన్నారు. రైతులకు సరైన సమయంలో విత్తనాలు, ఎరువులు అందక ఇబ్బందులు ఎదురయ్యాయని, పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోయారని గుర్తుచేశారు. రైతు భరోసా పేరుతో ప్రచారం చేసుకున్నా, వాస్తవంగా రైతుల జీవితాల్లో భరోసా లేకుండా చేశారని విమర్శించారు.

మామిడి రైతుల సమస్యలపై మాట్లాడే ముందు, వైసీపీ హయాంలో హార్టికల్చర్ రైతులు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఎగుమతులు తగ్గి, మార్కెటింగ్ వ్యవస్థలు కూలిపోయి, రైతులు మధ్యవర్తుల చేతిలో దోపిడీకి గురైనప్పుడు వైసీపీ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. మొక్కజొన్న రైతుల పరిస్థితి కూడా వైసీపీ పాలనలో అత్యంత దారుణంగా మారిందన్నారు. కనీస మద్దతు ధర అమలులో పూర్తిగా వైఫల్యం చెందారని, రైతులు రోడ్లపై ఆందోళనలు చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రైతు సమస్యలపై స్పందించాల్సిన నాయకులు, అప్పట్లో కేవలం ప్రచార రాజకీయాలకు మాత్రమే పరిమితమయ్యారని విమర్శించారు. వ్యవసాయ శాఖను వైసీపీ కాలంలో పూర్తిగా నిర్వీర్యం చేసిన వారే ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరం అని అచ్చెన్నాయుడు ఘాటుగా వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు న్యాయం జరిగేలా ప్రతి అంశాన్ని సమీక్షిస్తూ ముందుకెళ్తోందన్నారు. మామిడి రైతులకు మార్కెటింగ్ సదుపాయాలు, కొనుగోలు కేంద్రాలు, ధరల స్థిరీకరణపై ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని తెలిపారు. మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని చెప్పారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం పూర్తిగా అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. రైతుల పేరుతో డ్రామాలు చేయడం వైసీపీకి అలవాటైపోయిందని, కానీ ప్రజలు ఇప్పుడు వాస్తవాలను గుర్తిస్తున్నారని అన్నారు. రైతుల కోసం నిజంగా పనిచేయాలనే ఉద్దేశం ఉంటే చౌకబారు విమర్శలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కూటమి ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని, రైతుల ప్రయోజనాల కోసం ఎలాంటి నిర్ణయాలైనా తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి పౌర గ్రంథాలయంలో ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహిస్తున్న సమ్మర్ క్లాసులు ఎంతో సమర్థవంతంగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో 110 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గురువులు బోధిస్తున్న పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని, చురుకుగా పాల్గొంటూ విషయాలను సులభంగా అవగాహన చేసుకుంటున్నారు.

ఈ విజ్ఞాన శిబిరంలో భాగంగా పఠనం, సాధారణ విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, సృజనాత్మక నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. అలాగే కార్టూన్స్, డ్రాయింగ్, చెస్, పేపర్ క్రాఫ్ట్, మట్టితో బొమ్మలు తయారీ, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ విజ్ఞానం వంటి విభాగాల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు.

ఈరోజు కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ భీమనేని వందనా దేవి. హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ విద్యార్థులకు కార్టూన్స్ ఎలా గీయాలో స్వయంగా నేర్పించి, సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని కార్టూన్ చిత్రలేఖనంలోని పలు అంశాలను నేర్చుకున్నారు.

ఈ శిబిరం ద్వారా విద్యార్థుల్లో కొత్త విషయాలపై ఆసక్తి పెరగడంతో పాటు, వారి జ్ఞానం మరింత విస్తరించేందుకు తోడ్పడుతోంది. మొత్తం కార్యక్రమం క్రమబద్ధంగా, శ్రద్ధగా నిర్వహించబడుతుండగా, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

విద్యార్థుల అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఉచితంగా నిర్వహిస్తున్న ఈ వేసవి విజ్ఞాన శిబిరం జూన్ 6 వరకు కొనసాగనుంది.

## ముస్లిం విద్యార్థుల టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన



- ఏడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- 1462 మందికిగాను 1324 మంది హాజరు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- విద్యార్థులకు ఇబ్బంది లేకుండా వసతుల కల్పన
- ప్రతిభ ఆధారంగా ఉచిత విద్య, వసతి సౌకర్యాలు
- దేశంలోనే మైనారిటీల కోసం గొప్ప ప్రయత్నమన్న ఎమ్మెల్యే

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో తాలీం ఏ హూనర్ (వక్ఫ్ ఎడ్యుకేషన్ మిషన్) ద్వారా గుంటూరు నగరంలో ఆదివారం నిర్వహించిన ప్రతిభ పరీక్షకు విశేష స్పందన లభించింది. మొత్తం ఏడు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 1462 మందికి గాను 1324 మంది విద్యార్థులు హాజరయ్యారు. కొత్తపేటలోని జలగం రామారావు హైస్కూల్ లో 144 మందికి 125 మంది, ఉర్దూ బాలుర హైస్కూల్ లో120 మందికిగాను 107 మంది, రైలుపేటలోని ఎస్జీఎన్ కే బాలికల హైస్కూల్ లో 185 మందికిగాను 159 మంది, మణిపురంలోని మున్సిపల్ హైస్కూల్ లో 127 మందికిగాను 124 మంది, ఆర్టీసీ కాలనీ భాష్యం స్కూల్ లో 280 మందికిగాను 256 మంది, అంజుమన్ ఇస్లామియా హైస్కూల్ లో 287 మందికిగాను 260 మంది, ఆంధ్రా ముస్లిం కాలేజీ 319 మందికిగాను 219 మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో మంచినీటి వసతి సౌకర్యాలు కల్పించారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఓఎంఆర్ ఓఎంఆర్ షీట్ పద్ధతిలో పరీక్ష నిర్వహించారు. గుంటూరులోని ఏడు పరీక్ష కేంద్రాలను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరుపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. పూర్తి పారదర్శకంగా నిర్వహించిన పరీక్షలో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఉచిత విద్యకు ఎంపిక చేస్తామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. ముస్లిం విద్యార్థుల భవిష్యత్తు కోసం వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో తాలీం ఏ హూనర్ (వక్ఫ్ ఎడ్యుకేషన్ మిషన్) ద్వారా ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని తలపెట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిభ ఉన్న పేద ముస్లింల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తాము తొలి అడుగు వేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తాలీం ఏ హూనర్ (వక్ఫ్ ఎడ్యుకేషన్ మిషన్) ద్వారా పరీక్ష నిర్వహించామని, విశేష స్పందన లభించిందని తెలిపారు. త్వరలోనే ఫలితాలు వెల్లడిస్తామని, ప్రతిభ చాటిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్యతోపాటు ఐఐటీ, జేఈఈ/ఎన్ఈఈటీ/ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో ఉచిత విద్య, వసతి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.

## హైబ్రిడ్ మోడల్‌లో మహానాడు



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** మహానాడు రద్దుపై తెలుగుదేశం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాలతో ఇంధన వనరులు ఆదా చేసుకునే నేపథ్యంలో భాగంగా నెల్లూరులో జరగాల్సిన మహానాడు కార్యక్రమాన్ని రద్దు చేశామని తెలిపారు. ఆదివారం విశాఖపట్నంలో పల్లా శ్రీనివాసరావు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ ఆలోచనతో, సీఎం చంద్రబాబు ఏకీభవిస్తూ మహానాడును రద్దు చేశారని వెల్లడించారు. కోవిడ్ లాంటి సమయంలో వర్చువల్ మహానాడును ఏర్పాటు చేశామని ప్రస్తావించారు.

ఇప్పుడు మహానాడు కార్యక్రమానికి రూ.5 నుంచి రూ.10 కోట్లు ఖర్చుతో కూడుకున్న విషయమని, అలాగే దాదాపుగా పదివేల వాహనాలు మహానాడుకు చేరుకుంటాయని చెప్పుకొచ్చారు. ఇంధన వనరులు ఆదా చేసుకోవడం కోసం ప్రతి నియోజకవర్గంలో హైబ్రిడ్ మోడల్ మహానాడు నిర్వహిస్తామని వివరించారు. 1848 భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ప్రజలు వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం ప్రాంగణంలో పార్టీకి చెందిన 68 మంది సీనియర్ నేతలతో కూడిన బృందం మహానాడు సందర్భంగా దిశానిర్దేశం చేస్తారని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వివిఐటీలో బీజేపీ జిల్లా శిక్షణ తరగతులు ముగింపు
- దేశ భద్రత, సమగ్రత పరిరక్షణలో ప్రతి భారతీయుడు అప్రమత్తంగా ఉండాలి
- జీవీఎల్ నరసింహారావు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా నంబూరులోని వివిఐటి విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జిల్లా శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు ఆధ్వర్యంలో రెండో రోజు కార్యక్రమాలు ఉదయం యోగాతో ప్రారంభమై పలు అంశాలపై సమావేశాలు నిర్వహించారు.

"దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు" అనే అంశంపై మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ దేశ సమగ్రత, జాతీయ భద్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ విషయంలో ప్రతి భారతీయుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో దేశ ప్రజలు ఐక్యంగా నిలిచి జాతీయ ప్రయోజనాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు, దేశ భద్రతకు విఘాతం కలిగించే శక్తుల కుట్రలు, సోషల్ మీడియా ద్వారా వ్యాపిస్తున్న తప్పుడు ప్రచారాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా దేశ భద్రత, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన సమయం ఇదని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశ రక్షణ, ఆర్థిక స్థిరత్వం, అంతర్గత భద్రత విషయంలో దృఢ నిర్ణయాలతో ముందుకు సాగుతోందన్నారు. దేశాన్ని అస్థిరపరిచే శక్తులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని, ప్రజలు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు.

యువత సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని సూచించారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ లాభాలను ముఖ్యంగా భావించే కొన్ని ప్రతిపక్ష పార్టీల వైఖరి బాధాకరమని విమర్శించారు. సంక్షోభ సమయంలో దేశానికి అండగా నిలవాల్సింది పోయి అనవసర విమర్శలు చేయడం తగదన్నారు.

ఇంధన వనరుల పొదుపుపై కూడా మాట్లాడిన జీవీఎల్ నరసింహారావు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన కాన్వాయ్‌ను తగ్గించుకుని కేవలం రెండు కార్లతో ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. మోదీని ఆదర్శంగా తీసుకుని ఇంధన వనరులను పొదుపుగా వినియోగించాలని, విదేశీ ప్రయాణాలను తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. "దేశం ముందు -- రాజకీయాలు తర్వాత" అనే భావనతో ప్రతి భారతీయుడు దేశ అభివృద్ధి, భద్రత కోసం ఐక్యంగా ముందుకు రావాలని కోరారు.

మరో సెషన్‌లో "కార్యకర్తల వికాసం, పరిరక్షణ మరియు బాధ్యతలు" అనే అంశంపై ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ప్రసంగించారు. భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కార్యకర్తలే ప్రధాన శక్తి అని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే నిజమైన రాయబారులు కార్యకర్తలేనన్నారు. 93 కార్యకర్తల వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక అవగాహన, ప్రజా సమస్యలపై స్పందించే ధోరణి వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అవసరమని తెలిపారు. దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ, సమాజానికి అంకితభావంతో కార్యకర్తలు ముందుకు సాగాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు.

సోషల్ మీడియా యుగంలో తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పార్టీ సిద్ధాంతాలను వాస్తవాలతో ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ కష్టకాలంలో అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించి ప్రోత్సహించడం బీజేపీ ప్రత్యేకత అని తెలిపారు. "బలమైన కార్యకర్త – బలమైన పార్టీ – బలమైన దేశం" అనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా శిక్షణ ప్రభారి రాంపల్లి జగన్నాథ శాస్త్రి, శిక్షణ కన్వీనర్ భీమినేని చంద్రశేఖర్, జోనల్ ఇంచార్జి మకుటం శివ, కో కన్వీనర్లు చరక కుమార్ గౌడ్, మేడూరి యశ్వంత్‌తో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు, మోర్చా పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో కార్యకర్తలు పలు అంశాలపై అవగాహన పొందారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467